RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 30 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, జూలై,16, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 30 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, July,16, 2025 | PAGES : 8 RS : 4 /- |




లెక్చరర్ వేధింపులు భరించలేక

## విద్యార్థిని ఆత్మహత్య..

### బీజేపీపై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు

- ఒడిశాలో బీఈడీ విద్యార్థినికి లెక్చరర్ నుంచి లైంగిక వేధింపులు
- నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న బాధితురాలు
- ఇది బీజేపీ చేసిన వ్యవస్థీకృత హత్య అన్న రాహుల్ గాంధీ
- నిందితుడిని కాపాడేందుకు బీజేపీ వ్యవస్థ యత్నిస్తోందని ఆరోపణ
- మహిళలకు భద్రత, న్యాయం కావాలని వ్యాఖ్య

ఢిల్లీ,: ఒడిశా బాలేశ్వర్ లోని ఫకీర్ మోహన్ కాలేజీ లో బీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లెక్చరర్ వేధింపులు భరించలేక కాలేజీ ప్రాంగణంలో నిప్పంటించుకున్న సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆమె ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ... ఇది ఆత్మహత్య కాదని, బీజేపీ చేసిన వ్యవస్థీకృత హత్య అని అన్నారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. న్యాయం కోసం, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా బాధిత విద్యార్థిని ధైర్యంగా పోరాడిందని రాహుల్ అన్నారు.




బల్క్ డ్రగ్స్ రాజధానిగా

# హైదరాబాద్

**43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి**
**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్,జూలై15,తెలంగాణ దిశ:** ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.



ప్రమాదానికి ముందే..

# హెచ్చరించాం

**యూకే పౌర విమానయాన అథారిటీ**

అహ్మదాబాద్ : అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై వెలువడిన ప్రాథమిక నివేదికలో ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంపై ప్రస్తావించిన విషయం విదితమే. దీంతో ఇంధన స్విచ్‌లపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ %ా% యూకేకు చెందిన పౌర విమానయాన అథారిటీ కీలక ప్రకటన చేసింది. ఈ ప్రమాద ఘటనకు నాలుగు వారాల ముందే బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై హెచ్చరికలు చేసినట్లు వెల్లడించింది. 787 డ్రీమ్‌లైనర్‌తో సహా ఐదు రకాల బోయింగ్ విమానాల ఇంధన స్విచ్‌లపై మే 15న ఓ భద్రతా నోటీసు జారీ చేసినట్లు సీఏఏ తెలిపింది.

భారత్‌లో అడుగుపెట్టిన

# టెస్లా

**ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం**

ముంబై,జూలై15 : టెస్లీ కార్లు ఇక భారత రోడ్లపై పరుగెట్టనున్నాయి. ఎంతోకాలంగా అభిమానులు ఎదురు చూస్తున్న ఘడియ వచ్చింది. అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది.





100శాతం సుంకాలు

# విధిస్తాం

**రష్యాను బెదిరించిన ట్రంప్**

వాషింగ్టన్ : రష్యాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు దిగారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించకుంటే 100శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి వుంటుందని రష్యాను బెదిరించారు. సోమవారం నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 50 రోజుల్లోగా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని లేదా కొత్త ఆర్థిక ఆంక్షలను ఎదుర్కోవాల్సి వుంటుందని అన్నారు. నాటో దేశాల నుండి ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల తాను చాలా అసంతృప్తితో ఉన్నానని అన్నారు. యుద్ధం ముగించడానికి పుతిన్ నిరాకరించడతో తనకు సహనం నశించిందని చెప్పారు.



క్యూఆర్ కోడ్స్ ఉత్తర్వులపై యుపి ప్రభుత్వానికి

# సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : కన్వర్ యాత్ర మార్గం లోని అన్ని హెూటల్స్‌పై క్యూఆర్ కోడ్స్ ప్రదర్శించాలన్న పిటిషన్‌ల పై సుప్రీంకోర్టు యుపి ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం యుపి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ను జులై 22కి వాయిదా వేసింది. కన్వర్ యాత్ర మార్గాల్లోని తినుబండారాలు వాటి యజమానుల పేర్లు, గుర్తింపు, సిబ్బంది మరియు ఇతర వివరాలను..




నేటి జలశక్తి మంత్రి భేటీ


# ఉంటుందా?



సీతారామా క్రెడిట్

# ఎవరికి..?

ఖమ్మం,తెలంగాణ దిశ : గోదావరి జలాలు చెంతన పారుతున్నప్పటికీ వినియోగించుకోలేని దుస్థితి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులది. ఈ జిల్లాలో మెజారిటీ సాగు భూములు ఇప్పటికీ నాగార్జున సాగర్ కిందనే ఉన్నాయి. నాగార్జునసాగర్ గనుక నిండితే ఆయకట్టు రైతులు వరి సాగు చేస్తారు. లేకపోతే పొలాలను బీళ్లుగా పెడతారు. వాస్తవానికి సాగర్లో నీళ్లు ఉండగా నే సరిపోదు.. అవి సక్రమంగా వస్తేనే పొలాలు పారుతాయి.. లేకపోతే మధ్యలోనే ఎండిపోతాయి.. ఈ పరిస్థితి గమనించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పరిపాలకులు దుమ్ముగూడెం టెల్ ఫాండ్ ను తెరపైకి తీసుకొచ్చారు. దీని ప్రకారం అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద దీనిని నిర్మించాలని భావించారు. కాలక్రమంలో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోలేదు. చివరికి తెలంగాణ ఏర్పాటు కావడంతో.. భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావడంతో తెరపైకి సీతారామ ఎత్తిపోతల పథకం వచ్చింది.అనేక మార్పులు చేర్పుల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కట్టాలి అనుకున్న కుమ్మరిగూడెం వద్ద సీతారామ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.



స్వతంత్ర అభ్యర్థిగా..

## ఎన్నికల బరిలోకి

# రాజాసింగ్

**హైదరాబాద్, జూలై 15,తెలంగాణ దిశ :** బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలంగాణ రాజకీయాల్లో ఓ సంచలనం. హిందుత్వ ఎజెండాతో ఆయన చేసే వ్యాఖ్యలు జాతీయ మీడియాలోనూ మారుమోగుతుంటాయి. ఇక అంతర్జాతీయ టెర్రరిస్టుల నుండి కూడా బెదిరింపులు వస్తున్నాయని రాజాసింగ్ పలుమార్లు చెప్పడం ఆయన ఇమేజ్‌కు నిదర్శనం. అలాంటి రాజాసింగ్ రాజకీయ భవిష్యత్తుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇటీవలే రాజాసింగ్ పార్టీకి చేసిన రాజీనామాను ఆమోదించారు. ఈ క్రమంలో రాజాసింగ్ రాజకీయ అడుగులు ఎటువైపు అన్న చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది. అయితే రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే ఏదో పార్టీలో చేరకతప్పదు. రాజాసింగ్ గోషామహల్ నియోజకవర్గంలో పట్టున్న నేత. బీజేపీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భాలు ఉన్నాయి. ఇది పార్టీ గుర్తింపుతో కాకుండా, నియోజకవర్గంలో ఆయనకున్న సొంత బలంగానే చూడాలి.

# పారిశ్రామిక పెట్టుబడులకు అవసరమైన ప్రోత్సాహకాలు

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





శామీర్ పేట్,(హైదరాబాద్) జూలై 15, (తెలంగాణ దిశ) :పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు, అనుమతులను మంజూరు చేయడం వంటి సానుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు. శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐచోర్ బయాలాజిక్స్ కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద రెడ్డితో పాటు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపు నిచ్చారు. ఐటీ, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఫార్మా, బయో సైన్సెస్‌లతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులకు చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగం భారత్ వైపు దృష్టి సారించగా, అందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్దేశిత గడువు నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంతో పెట్టుకున్నామని అన్నారు. బల్క్ డ్రగ్స్, వాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే ఇక్కడి పారిశ్రామిక వేత్తల కృషి ఎంతో ఉంది. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని బయపెడుతున్న సమయంలో జినోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సిన్లు తయారు చేసి దాదాపు వంద దేశాలకు సరఫరా చేసిన సందర్భం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈరోజు దేశంలో 33 శాతం వ్యాక్సీన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతుండగా, 40 శాతం మేరకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తు చేస్తున్నామంటే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఈ మధ్య కాలంలో బయో, ఫార్మసీ రంగంలో కూడా ప్రపంచంలోని అత్యాధునిక విధానాలు అవలంభిస్తున్న పరిశ్రమలను అహ్వానించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. జినోమ్ వ్యాలీ పెట్టుబడుదారులకు స్వాగతం పలుకుతున్నాం. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. మీ మద్దతు కావాలి. పెట్టుబడులు పెట్టండి.." అని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

# జగదీష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

## - బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి



**భువనగిరి, జూలై 15, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాల్లో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఈ మాటలు మాట్లాడడం హేయమైన చర్య అని అన్నారు. జగదీశ్వర్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నాడని అనే ముందు..., రేవంత్ రెడ్డి నీవు ఎన్ని ఫీట్లు ఉన్నావని వెంకటేశ్వర రెడ్డి ప్రశ్నించారు. సోడా కలిపినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తెచ్చుడు అని సీఎం అంటున్నారని, కానీ బిఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సారథ్యంలో మూడు జిల్లాలకు మూడు మెడికల్ కాలేజీలు, తుంగతుర్తికి గోదావరి నీళ్లు తెచ్చామని అన్నారు. తనకు రేవంత్ రెడ్డి 1983 నుండి తెలుసునని, ఆయన ఊరు కొండారెడ్డి పల్లికి కూడా వెళ్లానని, రేవంత్ రెడ్డి ఫ్యామిలీ తెలుసునని, ఆయన చరిత్ర, ఆయన కున్న ఆస్తులు తెలుసునని, ఆయన కన్నా జగదీశ్వర్ రెడ్డిది పెద్ద కుటుంబమని, ఆయన కన్నా ఎక్కువ ఆస్తులు ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి లాగా గోడల మీద రాతలు రాసి గోడలు దూకి రాలేదన్నారు..? రాజకీయాల్లో విమర్శలు చేసే ముందు స్థాయికి మించి మాట్లాడడం హేయమైన చర్య అని అన్నారు.

# లబ్ధిదారులకు రూ. 93.95 లక్షల విలువగల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 15, (తెలంగాణ దిశ)** :ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద లబ్ధిదారులకు రూ. 93.95 లక్షల విలువైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కుతుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక తనను సంప్రదించారని పేర్కొన్నారు. దీంతో స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పలువురికి చెక్కులు మంజూరు చేయించి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 125 డివిజన్ గాజుల రామారం వాసులు ఉంగరాల వెంకటేశ్వర్ రావుకు రూ. 42,500, సిరా కేదార్నాథ్ కు రూ. 60 వేలు, గోమారం జయ లక్ష్మికి రూ. 47500, 127 డివిజన్ గిరి నగర్ వాసులు తసీన్ బేగమ్ కు రూ. 33,500, 128 డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్ వాసులు నల్ల అరుణ్ కుమార్ గౌడ్ కు రూ. 42,500, 131 డివిజన్ కుత్బుల్లాపూర్ వాసులు పున్న రఘునాథ్ కు రూ. 60 వేలు, పరిపటి అజితకి రూ. 35 వేలు, 132 డివిజన్ జీడిమెట్ల వాసులు నారెడ్ల కార్తీక్ రెడ్డికి రూ. 40 వేలు, ఖతీజ బీకి రూ. 30 వేలు, ధమ్మని సత్యనారాయణకు రూ. 60 వేలు, ప్రగతి నగర్ వాసులు కె. శ్రీదేవికి రూ. 60 వేలు, భౌరంపేట్ వాసులు మొహమ్మెద్ బీబీకి రూ. 50వేలు, అఖినబోయిన మాణెమ్మకి రూ. 60 వేలు, మడి ప్రేమలతకు రూ. 60 వేలు, దూలపల్లి వాసులు సురుకొంటి శివరాణికి రూ. 49 వేలు, అడల ప్రకాష్ కు రూ. 60 వేలు, బాచుపల్లి వాసులు జెర్మయ్య రామనాథులకు రూ. 60 వేలు, సయ్యద్ అహ్మద్ అలీకి రూ. 60 వేలు, కర్రీ ప్రసన్న కుమార్ కు రూ. 30 వేల విలువగల సీఎంఆర్ఎఫ్ మంజూరీ పత్రాలను (చెక్కులు) అందజేశారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలతో అల్లాడుతున్నాం

## - కలెక్టర్ కు మొర పెట్టుకున్న బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులు







**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 15, (తెలంగాణ దిశ)** :సమస్యలతో అల్లాడుతున్నామని, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్, జూనియర్ కాలేజీ విద్యార్థులు జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరికి మొరపెట్టుకున్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్, జూనియర్ కాలేజీలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ మరమ్మతుల వల్ల నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులు వివరించారు. డోర్స్, ఫ్యాన్స్, భోజనం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి మాట్లాడుతూ నీటి ట్యాంకును వెంటనే మరమ్మతు చేయించాలని, భోజనం, టిఫిన్స్, తయారు చేసే సామాగ్రి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డోర్లు, ఫ్యాన్లు తక్షణమే రిపేర్లు చేయించి వాడకంలో తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు కష్టంగా ఉన్న సబ్జెక్టుల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే క్రీడలు కూడా నిర్వహించాలని ఆయన సూచించారు. వంటగదిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు శుభ్రంగా పెట్టాలని దోమలు, ఈగలు రాకుండా శానిటేషన్ పక్కగా ఉండాలని అన్నారు. బియ్యం, కూరగాయలను బాగా కడగాలని.. వంట తీరు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫామ్స్, నోట్ బుక్స్ అందరికీ వచ్చాయా, భోజనం బాగుంటుందా, చదువు ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. సబ్జెక్టులు అర్థమవుతున్నాయా, ఎవరెవరికి ఏ సబ్జెక్టులు కష్టంగా ఉన్నాయి. అలాగే ఎమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాదగిరి రెడ్డి, హెడ్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్



నేరేడ్ మెట్, జూలై 15, (తెలంగాణ దిశ) :ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయం పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారంతీన్మార్ మల్లన్న పై అలాగే క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డిసిపి అడ్మిన్ శివకుమార్ కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. దాడి జరిపించిన ఎమ్మెల్సీ కవితపై ఆమె అనుచరులతో పాటు ఇందుకు సహకరించిన మేడిపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ గోవింద రెడ్డి లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ బిసి ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి భవిష్యత్తులో బిసి రాజ్యాధికారాన్ని సాధించే దిశగా పయనిస్తున్న బిసి నాయకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చేసిన దాడి, ఆ ఒక్క మల్లన్నపై చేసిన దాడి కాదని, యావత్ తెలంగాణలోని రెండు కోట్ల బిసిలపై చేసిన దాడి అని వారు అన్నారు. ప్రస్తుతం రాష్టంలో ఏదైనా ఉద్యమం కొనసాగుతుందంటే అది ఒక్క బిసి ఉద్యమం మాత్రమేనని, అలాంటి బిసి ఉద్యమాన్ని అణచి వేయాలంటే తీన్మార్ మల్లన్నను అణచి వేయాలనే దురుద్దేశంతోనే తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నానికి పాల్పడడం జరిగిందని అన్నారు. ఈ హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవ్వరు ఎన్ని దాడులు చేసిన ఎన్ని హత్యాయత్నాలకు పాల్పడిన భవిష్యత్తులో తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణాలో బిసిల రాజ్యాధికారం సాధించుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు రజని కుమార్, సుదగాని సుదర్శన్ గౌడ్, సుతారపు రంగయ్య, పనగట్ల చక్రపాణి గౌడ్ తీన్మార్ మల్లన్న వ్యక్తిగత కార్యదర్శి ఎం. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో యువకుడి మృత దేహం లభ్యం



**కుత్బుల్లాపూర్, జూలై 15, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ తురక చెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది కథనం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో 100 నెంబర్ కి నిజాంపేట తుర్కచెరువు సమీపంలో ని స్థానికులు ఫోన్ చేసి తురకచెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం తేలియాడుతూ కనిపిస్తుందంటూ సమాచారం అందించారు. దీంతో బాచుపల్లి పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ( డి ఆర్ ఎఫ్) సిబ్బంది సంఘటన స్థలమైన తురకచెరువుకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. మృతిచెందిన యువకుడికి సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్ల ప్యాంటు తెల్ల షర్టు ధరించి ఉన్నాడు. నల్ల నల్ల రంగు చెప్పులను మృతుడు కలిగియున్నాడు. మృతదేహంపై ఎలాంటి దెబ్బలు గాని కత్తిపోట్లు గాని ఇతరత్రా అనుమానాస్పద గాయాలు ఏమీ లేవు. దీంతో మృతుడు ఆత్మహత్య కైనా పాల్పడి ఉంటాడని లేదంటే ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించి ఉంటాడని బాచుపల్లి పోలీసులు భావిస్తున్నారు. మృతిచెంది న వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే బాచుపల్లి పోలీసులకు గాని, 100 నంబర్ కు గాని సమాచారం అందించాలని బాచుపల్లి పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బిజెపి చర్లపల్లి డివిజన్ నూతన కమిటీ నియామకం





**చర్లపల్లి, జూలై 15, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ చర్లపల్లి డివిజన్ నూతన కమిటీని మంగళవారం నియమించారు. బిజెపి చర్లపల్లి అధ్యక్షులు చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో కుషాయిగూడ శుభోదయ కాలనీలోని కాటమయ్య భవన్ లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ చర్లపల్లి డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎన్. జనార్ధన్, ఎం. లక్ష్మీనారాయణ, ఎస్. అశోక్, డి. రామకృష్ణ గౌడ్, శ్యామల శంకర్ వంశరాజ్, ప్రధాన కార్యదర్శిగా బి. పవన్ కుమార్, కోశాధికారిగా కె. బ్రహ్మాచారి, కార్యదర్శులుగా టి. సంపత్, సిహెచ్ శ్రీకాంత్, పి. రాజు, పి. చంద్రకళ, ఎన్. బాలకృష్ణారెడ్డి, పిట్ల కిషన్, అధికార ప్రతినిధులుగా పి. గణేష్ గౌడ్, ఆర్. వెంకటేశ్వర్లును నియమించారు. ఈ మేరకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకాష్ లే అవుట్ లో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కుత్బుల్లాపూర్, జూలై 15, (తెలంగాణ దిశ) :దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ ఆకాశ్ లేఅవుట్ పరిధిలో సీసీ నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. కాలనీలో రోడ్డు సౌకర్యం లేక కాలనీవాసులు వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సమస్య పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులతో సంప్రదింపులు జరిపి మున్సిపల్ స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించిన హన్మంత్ రెడ్డిని ఈ సందర్భంగా కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపాల్ పద్మ రావు, అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, రేవంత్ రెడ్డి, రామకృష్ణ, సత్య, అచిత్రరామ రావు చెనపు రెడ్డి, సురేష్, హరి వర్ధన్ రావు, శ్రీనువాస్, శివగణేష్, సురేందర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కలవర పెడుతున్న కల్తీ ఆహారం..!

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళ్లు..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷–లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆ రోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిసే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి. ముందే ఆర్డర్ ఇవ్వడం, రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. అయితే ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న హోటళ్లు కూడా శుచి, శుభ్రత, నాణ్యత విషయంలో డొల్ల అని తేలింది. వారి కిచెన్‌లను పరిశీలించినప్పుడు పాచిపోయిన, కాలం చెల్లిన పదార్థాలు దర్శనం ఇస్తున్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీ మళ్లీ నూనెలో వేయించి,వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు. పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపుతుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. వంట నూనెల నియంత్రణ చట్టం–1947, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం–1955, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం–1992 వంటివి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదు. ఆహారం కల్తీ చేయటం, నాసిరకం పదార్థాలు అమ్మటం నేరమని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం–2006 చెబుతున్నది. ఆహార కల్తీ నిరోధక చట్టం–1954 కఠిన శిక్షలను నిర్దేశిరచింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి ఆరు నెలల తప్పనిసరి జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తూ.. కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా.. వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ సమక్షంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష వేసే అవకాశం ఉంది.సబ్ స్టాండర్డ్ కేసుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్తులు బయట పడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ కల్తీ ఆహారం తిని ఎవరైనా చనిపోయినట్లు నిరూపించగలిగితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి. ఇన్ని శిక్షలున్నా కల్తీ నిరా ఘాటంగా జరిగిపోతూనే వుంది. కల్తీ ఆహారానికి సంబంధించి ప్రభుత్వాలు కదలాలి. నిఘా పెరగాలి. తనిఖీ నిరంతరం కొనసాగాలి. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలలో సైతం చైతన్యం పెరగాలి. అప్పుడే ఈ కల్తీకిక్లళెం వేయగలం అని గుర్తించాలి. అందుకే భోజన ప్రియులు ఇవన్నీ గుర్తించి తినడం మంచిది. లేకుంటే లేని రోగాలను, క్యాన్సర్‌లను కొని తెచ్చుకోవడం జరుగుతుంది.

## నాగారంలో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు..

**- పట్టించుకోని కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు**

**- చైన్ మెన్ల కాదు... కలెక్షన్ ఏజెంట్లు**



**నాగారం, జులై 15, (తెలంగాణ దిశ) :**నాగారం మున్సిపాలిటీ శిల్పా నగర్ లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చైన్ మెన్లు నుంచి మున్సిపల్ కమిషనర్ వరకు అందిన కాడికి దండుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, మేడ్చల్ జిల్లా అదరపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా సైతం పట్టించుకోకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ కట్టడాల విషయంలో అనేక ఫిర్యాదులు జిల్లా యంత్రాంగానికి అందుతున్న చర్యలు తీసుకోకపోవడంలో ఆంతరమేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని మున్సిపల్ అధికారులు తమ జేబులు నింపు కుంటున్నారని వినికిడి. మున్సిపల్ పరిధిలో వసూళ్ల కోసం చైన్ మెన్లను వాడుకుంటూ అడ్డంగా దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా చైన్ మెన్లను కలెక్షన్ ఏజెంట్లుగా వాడుకుంటున్నారని..? బహిరంగంగా చర్చ జరుగుతుంది. ఈ విషయంలో మున్సిపల్ ఉన్నతాధికారులు జోక్యం తీసుకుని తక్షణమే నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

## బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా పాలాభిషేకం..



**కుత్బుల్లాపూర్, జూలై 15, (తెలంగాణ దిశ) :**బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో బీసీల్లో కాంగ్రెస్ పట్ల పూర్తి సానుకూల భావన ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బాచుపల్లిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు స్థానికులతో కలిసి రాజశేఖర్ రెడ్డి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు, దళితులకు, గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ హాయంలోనే లబ్ధి చేకూరుతుందని అన్నారు. అనంతరం బాచుపల్లిలోని పలు కాలనీలను ఆయన సందర్శించారు. స్థానికుల నుంచి అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం అభ్యర్థనలు స్వీకరించారు. సాధ్యమైనంత త్వరలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కోలన్ జీవన్ రెడ్డి, కోలన్ బాల్ రెడ్డి, ఎ. శంకర్, జీతయ్య. జిత్తు, రాము, టిల్లు, సంజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన "అశోక వనం" ప్రాజెక్టు

**- శ్రీ చైతన్య విద్యార్థులకు అభినందనల వెల్లువ**



**హన్మకొండ, జూలై 15, (తెలంగాణ దిశ) :**నాసా నిర్వహించిన వివిధ పోటీలలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అనేక బహుమతులు సాధించారు. ముఖ్యంగా నాసా యొక్క స్పేస్ సెటిల్మెంట్ పోటీలో వారు ప్రపంచ ఛాంపియన్స్ నిలిచారు. ఇందులో భాగంగా హన్మకొండ హంటర్ రోడ్ లోని శ్రీ చైతన్య (సీబీఎస్ సీ) పాఠశాల నాసా విద్యార్థులు "అశోక వనం" పేరుతో నిర్వహించిన ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపల్ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్ సిఐ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా నాసా- ఎన్ఎస్ఎస్ - ఐసీడీసీ కాన్ఫరెన్స్-2024లో శ్రీ చైతన్య స్కూల్ విజయకేతనం ఎగర వేస్తూ సరి కొత్త రికార్డు సృష్టించటం విశేషమన్నారు. ప్రపంచ ఛాంపియన్ గా శ్రీ చైతన్య విద్యార్థులు నిలవడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు కైవసం చేసుకున్న శ్రీ చైతన్య విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ శ్రీ విద్య, డైరెక్టర్ శ్రీధర్, ఏజీఎం చేతన్, హన్మకొండ జోన్ కో ఆర్డినేటర్ శివ కోటేశ్వర్ అభినందనలు తెలిపారు. అకాడమిక్ డీన్ కరుణాకర్, నాసా ఇంచార్జీ సరిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నేడు నాగారంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాలు




**నాగారం, జూలై 15, (తెలంగాణ దిశ) :**చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా నాగారం లోని పలు ప్రాంతాలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నాగారం విద్యుత్ ఏఈ ఎ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గాంధీ నగర్ ఫీడర్ నాగారం సబ్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్, మాదిరెడ్డి మల్లారెడ్డి కాలనీ, బిఎంఆర్ ఎన్‌క్లేవ్, వెస్ట్ గాంధీ నగర్, భవాని నగర్, శివానందపురి కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదే విధంగా భారతరత్న పీడర్ పరిధిలోని అహ్మద్ గూడ సబ్ స్టేషన్ పరిధిలోని ఈడెన్ గార్డెన్, ఆర్ జికె వై - జంక్షన్, ఎన్జీఆర్ కాలనీ, విఆర్ఆర్ ఫేస్ 1, 2, ఇందిరమ్మ కాలనీ, కెఎల్ఆర్ వాటర్ ప్లాంట్ బ్యాక్ సైడ్, విఆర్ఆర్ హెూమ్స్, పద్మజ ఎన్ క్లేవ్, సెయింట్ ఆడ్రూస్ స్కూల్, లక్ష్మి గణపతి కాలనీ, సాయి శ్రీనివాస్ కాలనీ, బాలాజీ నగర్, పల్లవి నగర్, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ బండ్లగూడ, విరాట్ కాలనీ, ఠాకూర్ కాలనీ, శ్రీ రామ్ నగర్ కాలనీ, మోడీ అపార్ట్‌మెంట్, లక్ష్మి నగర్, బలహీన వర్గాల గృహ సముదాయం ప్రాంతాలలో సరఫరా లో అంతరాయం ఉంటుందని తెలిపారు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## విజయ హైస్కూల్ లో"ఇన్వెస్టిచర్ సెర్మనీ"





**కాప్రా, జూలై 15, (తెలంగాణ దిశ) :**క్రమశిక్షణ, దేశభక్తి, ప్రతిభకు ఆలవాలమైన విజయ హైస్కూల్ కాప్రాలో హైస్కూల్ విద్యార్థుల చేత 'ఇన్వెస్టిచర్ సెర్మనీ' కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా హైస్కూల్ స్థాయిలో వివిధ విభాగాల నుండి బ్లూ, గ్రీన్, ఎల్లో, రెడ్ విభాగాల నుండి నాయకులుగా హై స్కూల్ విద్యార్థులను ఓటింగ్ ద్వారా ఎన్నుకొని,నియమించి సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేష్ విద్యార్థులకు ధ్వజాలను అందించి,వారిని ఉద్దేశించి మాట్లాడుతూ "క్రమశిక్షణ లేని చదువు చుక్కాని లేని నావ లాంటిది,విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని, అవి నాణేనికి బొమ్మ- బొరుసు లాంటివని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయించాలి

**- సిఎండిఎ శ్రీదేవికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వినతి**



**కుత్బుల్లాపూర్, జూలై 15, (తెలంగాణ దిశ) :**దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమీషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టికె. శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో సంవత్సరాల నుండి అభివృద్ధిలో వెనుకబడి ఉన్న దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు నాగులురు, డి.పోచంపల్లి, దుండిగల్ అలాగే లంబాడి తాండల అభివృద్ధి, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు శ్రీదేవి సానుకూలంగా స్పందించి దుండిగల్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ సర్పంచ్ కావలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంటా వర్సెస్ విష్ణుకుమార్ రాజు

విశాఖపట్టణం: విశాఖ సిటీలో కూటమి ఎమ్మెల్యే విష్ణుకు మార్ రాజు, గంటా శ్రీనివాసరావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుం ది. ఇటీవల ఫిలింనగర్ క్లబ్ లీజ్ విషయంలో విష్ణుకుమార్ రాజు కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే ఆ వ్యవహారందిభీమిలి నియోజకవ ర్గం పరిధిలోకి వస్తుందని.. తనకు తెలియకుండా లీజు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి ఎలా తీసుకెళ్లారని అంటూ విష్ణు కుమార్ పై మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. ఈలీజు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికీ తీసుకెళ్లే సమయంలో మీరు అందుబాటులో లేరని.. గంటా శ్రీనివాస్ కు క్లారిటీఇచ్చే ప్రయత్నం చేశారువిష్ణు కుమార్. ఓ కార్యక్రమంలో గంటా శ్రీనివాసరావు,విష్ణుకుమార్ రాజుపాల్గొన్నారు. ఆసమయంలో గంటా కారులో కూర్చొని సీరియస్‌గా మాట్లాడుతుంటే.. విష్ణు కుమార్ రాజు కారు పక్కనే నిలబడి సమాధా నం చెబుతూ ఉన్నారు. ఈ తతంగాన్ని మీడియా వీడియోలు తీసింది. గంటాశ్రీనివాసరావు మాత్రం వినకుండా కేకలు వేస్తూ వాహనంలో కూర్చొని మరింత ఆగ్రహంతో స్పందించారు. ఈక్రమంలో తోటి నేతలు సర్ది చెప్పే ప్రయత్నంచేయగా.. గంటా అదేంపట్టించు కోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. 2014లో విశాఖ ఫిల్మ్‌క్లబ్‌ను ఏర్పాటు చేశారు.సినిమా,సాంస్కృతిక కార్యకలాపాల ప్రభుత్వం నుండి భూమిని లీజుకు తీసుకుంది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చింతల వెంకటేశ్వర్ రెడ్డి





**తిరుపతి, జూలై 15, (తెలంగాణ దిశ) :**తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. అనంతరం డిప్యూటీ ఈఓ లోకనాథం స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## విద్యా సముపార్జనతో ఆత్మవిశ్వాసం

హైదరాబాద్: ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగిఉండాలని, దీనికి విద్యా సముపార్జన అత్యంత అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. తమకేంకావాలో పిల్లలే తెలుసు కోగలిగేలా తల్లిదం డ్రులు వారిని తీర్చిదిద్దాలని అన్నారు. హై విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'థ్రెడ్స్ ఆఫ్ హోప్' పేరిట విద్యా దాతృత్వం, సీఎస్ఆర్ సమ్మిట్ బంజా రాహిల్స్ పార్క్ హయత్ హోటల్ లో జరిగింది. ఇందులో సినీతారలు సుస్మితా సేన్,దియా మిర్జా సహారాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కిమ్స్ ఆస్పత్రి సీఎండి డా. బి. భాస్కర్రావు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విరాజ్ మల్హాన్, రేఖా శ్రీనివాసన్, తారా మేనన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హై విజన్ వ్యవస్థాపకులు లైలా కజానీ, అస్లామ్ హిరానీ, డా. ప్యార్ అలీ జివానీ, వీఎస్ గణేష్, పూనం యార్లగడ్డ తదితరులు మాట్లాడుతూ.. ఫౌండేషన్ ప్రస్థా నాన్ని, పేద విద్యార్థులకు అంది స్తున్న సాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా దియా మిర్జా, సుస్మితాసేన్ నడుమ 'ఫైర్ సైడ్ చాట్' పేరిట ముఖాముఖి సంభాషణ జరిగింది.

# ఏఎస్ రావునగర్ లో 'కాయ' క్లినిక్ ప్రారంభం

## బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ చేతుల మీదుగా నగరంలో ఆరవ బ్రాంచి ప్రారంభం







**హైదరాబాద్, జూలై 15, (తెలంగాణ దిశ) :** భారత్ లో చర్మ సంరక్షణకు ఎంతో ప్రసిద్ధి చెందిన 'కాయ' క్లినిక్ ను నగరంలోని ఏఎస్ రావునగర్ లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ మంగళవారం ప్రారంభించారు. ఇది నగరంలో 6వ, దేశంలో 81వ క్లినిక్ గా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు ధైర్యం, నమ్మకం ఎక్కడ నుంచి వచ్చాయంటే.. క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, మనపై మనం పెట్టుకునే శ్రద్ధ వల్ల అని చెప్పారు. కాయలో కూడా ఈ విలువలు, నిజాయితీతో కూడిన సేవలతో ప్రతిబింబిస్తామని తెలిపారు. హైదరాబాద్ కుమార్తెగా.. ఈ నగరంలో కాయ విశ్వసనీయ సేవలతో విస్తరిస్తరించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాయ లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ నిషాంత్ నయ్యర్ మాట్లాడుతూ కాయ ప్రయాణంలో ఈ నగరం ఒక ముఖ్యమైన భాగమన్నారు.

గొప్ప వారసత్వం, ఆధునిక జీవనశైలి ఈ నగరం ప్రత్యేకత అన్నారు. తక్కువ జీవన వ్యయం, అభివృద్ధి చెందిన ఐటీ రంగం ఎంతో మందిని ఆకర్షిస్తుందన్నారు. ఈ వాతావరణం వల్ల మా విస్తరణకు అద్భుతమైన స్థలంగా మారిందన్నారు. ఏఎస్ రావు నగర్ లో క్లినిక్ ద్వారా ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు చర్మ సంరక్షణ సేవలు అందించాలన్న మా నిబద్ధతను తెలియజేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కాయ లిమిటెడ్ హెడ్ డెర్మటాలజిస్టు, సౌత్ ఇండియా మెడికల్ అడ్వైజర్ డాక్టర్ వీనా ప్రవీణ్ మాట్లాడుతూ ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో చాలామంది ప్రొఫెషనల్స్ ఎక్కువ సేపు స్క్రీన్ ముందు ఉండే పరిస్థితి ఉందన్నారు. ఫలితంగా చర్మంపై మచ్చలు, ముడతలు వంటి సమస్యలు వస్తున్నాయన్నారు.

దక్షిణాదిలో ప్రధానంగా హైదరాబాద్ లో వ్యక్తిగత అవసరాలకు తగినట్లు యాంటీ-ఏజింగ్, హెయిర్ రెస్టోరేషన్ చికిత్సల కోసం డిమాండ్ పెరుగుతోందన్నారు.

ఏఎస్ రావు నగర్ లోని ఈ కొత్త క్లినిక్ లో అత్యాధునిక సాంకేతికత క్లినికల్ నైపుణ్యంతో ఉత్తమ డెర్మటాలజీ సేవలు అందించాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఈ ప్రాంతానికి ఉన్న సౌలభ్యాలను దృష్టిలో పెట్టుకొని క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. నమ్మకమైన సేవలు, నిపుణులైన వైద్యులతో ప్రజల అవసరాలు తీరుస్తున్నామని చెప్పారు.

ఈ క్లినిక్ ద్వారా విశ్వసనీయ చర్మ సంరక్షణ సేవలు హైదరాబాద్ లోనే కాకుండా దేశమంతా మరింత మందికి అందించాలన్న కాయ లక్ష్యాన్ని మరోసారి స్పష్టం చేస్తుందన్నారు. ఏఎస్ రావునగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమన్నారు. ఈ ప్రాంతంలో ఈ క్లినిక్ కేవలం చర్మ సంరక్షణకే కాకుండా శాస్త్రీయ పరిజ్ఞానంతో కూడిన సౌందర్యానికి నిలయంగా మారుతుందన్నారు. అత్యాధునిక సాంకేతికతతో కస్టమర్లు ఈ అనేక సేవలు పొందవచ్చన్నారు. మచ్చలు తొలగింపు, మొటిమలు, లేజర్ హెయిర్ రిమూవల్, యాంటీ-ఏజింగ్ థెరపీలు, మెడి ఫేషియల్స్, జుట్టు పునరుద్ధరణ, బాడీ కాంటూరింగ్.. ఈ చికిత్సలు అర్హత కలిగిన బోర్డ్ సర్టిఫైడ్ డెర్మటాలజిస్టుల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు.

# 9.14 అగ్రిమెంటు ఏమైంది..?

### - పూలింగు 2.0తో మా భూముల పరిస్థితి ఏమిటి - రాజధాని రైతుల్లో ఆందోళన..?



**అమరావతి,తెలంగాణ దిశ:** రాజధాని పరిధిలో ప్రభుత్వం రెండో దశ పూలింగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో గతంలో భూములిచ్చిన రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. 2015లో తమ భూములు తీసుకునే సమయంలో సిఆర్‌డిఎతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మూడేళ్లలో ప్లాట్లు, లేఅవుట్లు అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉందని, ఇప్పటికీ అతీగతి లేదని ఆందోళన చెందుతున్నారు. కనీసం అభివృద్ధి చేసుకుని ఇళ్లు కట్టుకునేందుకు కూడా అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. రాజధాని పరిధిలో 2019 అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి మొత్తం 53,748 ఎకరాలు, వాటిల్లో గ్రామాలు, కాలువలు అన్నీ కలిపి 15,166 ఎకరాలు, పూలింగు కింద వచ్చే పట్టా భూమి 38,581 ఎకరాలు, పూలింగుకు ఇచ్చింది 34,094 ఎకరాలు. అనంతరం అభ్యంతరాలు, విచారణ అనంతరం కొంత భూమి కలిసింది. పూలింగు ప్రక్రియ చేపట్టే ముందు 2018 డిసెంబర్ 8వ తేదీన రాజధాని ప్రకటన అనంతరం 2015 జనవరి ఒకటో తేదీన పూలింగు చట్టాన్ని విడుదల చేశారు. చట్టంలో పేర్కొన్న విధంగా సెక్షన్ 43, సబ్ సెక్షన్ 5 ప్రకారం రైతుల నుండి వేర్వేరు ఫారాల రూపంలో భూములు సమీకరించారు. దీని ప్రకారం ఫారం 9.1 పూలింగు భూమి ఎంత అనే ప్రకటన ఇచ్చారు. 9.2 అభ్యంతరాలు, 9.3 అంగీకారం, 9.4 మొత్తం భూమి ఎంతుందనే ప్రకటన, 9.5 ఫారం ప్రకారం విచారణ అనంతరం రాజధానికి ఎంత పరిధిలో ఉందనే ప్రకటన చేశారు. అక్కడ నుండి రికార్డుల పరిశీలన, కలెక్టర్ల ప్రకటన, తీసుకున్న దరఖాస్తుల ఖరారు వంటి వాటికి అనేక ఫారాలు ఉన్నాయి. వీటిల్లో చివరిగా 9.14 అగ్రిమెంటు (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) రైతుల నుండి సంతకాలు తీసుకున్నారు. ఈ ఫారంలోనే రైతుల నుండి సిఆర్‌డిఎకు సంక్రమించిన భూములను ఏమైనా చేసుకుంటామని, అడిగేందుకు వీలులేని విధంగా నిబంధన పొందుపరిచారు. దీంతోపాటే రైతులకు తిరిగి ఇస్తామన్న భూములు నివాస, వాణిజ్య ప్లాట్లను మూడేళ్లలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2015 ఫిబ్రవరి 28 నాటికి పూలింగు ప్రక్రియను ముగించారు. అంటే 2018 మార్చి ఒకటి నాటికి రైతుల ప్లాట్లను పూర్తిగా అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంది. 2019 వరకూ అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఆ మేరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కొన్ని పనులు చేసినా రైతుల ప్లాట్ల విషయంలో ముందడుగు వేయలేదు. అనంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. సుమారు తొమ్మిదేళ్ల తరువాత ఇప్పుడు రెండో విడత పూలింగు అనడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బహిరంగంగా ప్రకటనలు చేయొద్దని అనుకున్నట్లు తెలిసింది. 9.14 అగ్రిమెంటు విషయంలో తమకు న్యాయం జరగలేదని, వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు కోర్టులో పిటిషన్లు కూడా దాఖలు చేశారు. ఈ విషయంపై ఇటీవల కాలంలో రైతులు సమావేశంలో చర్చించినట్లు తెలిసింది.

# కౌన్సిలర్ నుంచి పెద్దల సభ వరకు...

**ఏలూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో ఖాళీగా ఉన్న ఒక్క రాజ్యసభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ పేరు ఖరారు చేశారు. ప్రస్తుతం ఆయన ఏపీ బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ గా ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే అనూహ్యంగా ఆ స్థానం సోము వీర్రాజు దక్కించుకు న్నారు. ఇప్పుడు అదే ప్రాంతానికి చెందిన నేతకు రాజ్యసభ సీటు కేటాయించారు.వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. మరో నాలుగేళ్ల వరకూ పదవి కాలం ఉన్న స్థానం కావడంతో ఎవరికి లభిస్తుందో అన్న చర్చ ప్రారంభమయింది. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పిస్తారని అనుకున్నారు. అయితే రాను రాను ఆయన పేరు వెనుకబడిపోయింది. తమిళనాడు రాజకీయ పరిణామాల రీత్యా.. అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపి.. కేంద్ర మంత్రిని చేస్తారని అనుకున్నారు . అలాగే స్మృతి ఇరానీ పేరు కూడా పరిశీలనకు వచ్చింది. కానీ .. చివరికి స్థానిక నేత అయిన పాకా వెంకట సత్యనారా యణకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. వర్గాలకు పార్టీ అవకాశం కల్పించిందని ఆ పార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవులన్నీ ఒకే ప్రాంతానికి కేటాయిస్తూ ఉండటంతో బీజేపీలోని ఇతర ప్రాంత నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే బీజేపీ కోటా నుంచి భర్తీ అని తేలటంతో వారు ఆశలు వదులుకున్నారు. ఈ స్థానం నుంచి ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేరును ఇటీవల అమిత్ షా కు సీఎం చంద్రబాబు సిఫార్సు చేసినట్లుగా తెలిసింది. ఇక, రేసులో అన్నామలై, స్మృతి ఇరానీ పేర్లూ వినిపించాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రచారం జరిగినా.. అనూ హ్యంగా పాక వెంకటసత్యనా రాయణ పేరుకూటమిఅభ్యర్థిగా ఖరారైం ది. కేంద్రమంత్రి కూడా గోదావరి జిల్లాలకు చెందిన వారే. కూటమిలో భాగంగా వచ్చిన ఎమ్మెల్సీ, రాజ్యసభ కూడా అదే ప్రాంతానికి ఇచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు కూడాసాంకేతికంగాఅదే ప్రాంతానికి చెందినట్లు రాయలసీమ నేతల్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి ఆ ప్రాంతానికి ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి ఉన్నారు. ఆమె స్థానంలో ఇతరుల్ని నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

# నెల్లూరు టీడీపీలో తమ్ముళ్ల అసంతృప్తి

**నెల్లూరు,తెలంగాణ దిశ :** నెల్లూరు టిడిపిలో అసంతృప్తులు ఉన్నాయా? సీనియర్లకు గౌరవంలభించడం లేదా? వైసీపీ నుంచి చేరిన వారి హవా కనిపిస్తో ందా? సీనియర్ నేతల్లో అసంతృప్తికి అదే కారణమా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. 2024 ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో స్పష్టమైన హవా కనబరిచింది టిడిపి కూటమి. పదికి పది స్థానాలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి అండగా నిలిచిన జిల్లా.. యూటర్న్ తీసుకుంది.కనీసం ఉనికి చాటుకో లేకపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతోంది టిడిపి. ఆ పార్టీ సీనియర్లలో అసంతృప్తి ప్రారంభమైందన్న టాక్ వినిపిస్తోంది.తెలుగు దేశం పార్టీ గెలుపోటములతో సంబంధం లేకుండా.. ఆ పార్టీకి అండగా నిలబడ్డారు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం ఆయన కొనసాగుతూ వచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తున్నారు. 2014లో సైతం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఓడిపోయారు. ఎమ్మెల్సీగా ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారు చంద్రబాబు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం ఎమ్మెల్యేగా గెలిచిన సోమిరెడ్డికి అవకాశం ఇవ్వలేదు. జిల్లా నుంచి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి లకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చి.. సోమిరెడ్డి విషయంలో ఎటువంటి అవకాశం కల్పించలేదు.మరోవైపు జిల్లాలో ఎంపీ వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట బాగా చెల్లుబాటు అవుతోంది. 2024 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరారు వేంరెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సరైన గౌరవం దక్కకపోవడంతో వేంరెడ్డి టిడిపిలోకి వచ్చారు. ఆయనకు నెల్లూరు ఎంపీ టికెట్ ఇచ్చారు. ఆయన భార్య ప్రశాంతి రెడ్డికి కోవూరు టికెట్ ఇచ్చారు. వారిద్దరూ గెలవడంతో పాటు జిల్లాలో మిగతా అభ్యర్థుల గెలుపు కోసం పోరాటం చేశారు. జిల్లాలో పదికి పది సీట్లు రావడానికి వేం రెడ్డి కారణం. అందుకే చంద్రబాబు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే అది టిడిపి శ్రేణులకు మింగుడు పడడం లేదు.ఎన్నికల కు ముందు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరారు ఆనం రామనారాయణరెడ్డి. ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు చంద్రబాబు. ఇంకోవైపు వైసీపీ నుంచి టిడిపిలో చేరిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మాట సైతం చెల్లుబాటు అవుతుంది. పనులు, నిధుల విషయంలో ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. సహజంగానే ఇది టిడిపి సీనియర్లకు ఎంత మాత్రం మింగుడు పడడం లేదు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచామని వారు చెబుతున్నారు. కానీ తమను కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరిన వారికి ప్రాధాన్యం దక్కుతోందని వారు బాధపడుతున్నారు. అయితే ఈ అసంతృప్తి ఎంత దూరం తీసుకెళ్తుందో చూడాలి.

# సీమలో మారుతున్న రాజకీయ పరిస్థితులు..!

**తిరుపతి,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ మళ్లీ పుంజుకుంటున్నట్లు కనిపిస్తుంది. గత ఎన్నికల్లో కోల్పోయిన స్థానాలను తిరిగి నిలబెట్టుకునే దిశగా ఫ్యాన్ పార్టీ అడుగులు వేస్తుంది. అయితే అన్ని ప్రాంతాల్లో కాదు. ప్రస్తుతం రాయలసీమలో మాత్రం వైసీపీ బలం క్రమంగా పెరుగుతున్నట్లు అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో సీన్ ఛేంజ్ అయినట్లు కనిపిస్తుంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చకపోవడంతో పాటు ఆధిపత్య పోరు రాయలసీమలో నేతల మధ్య ఎక్కువగా కనిపిస్తుంది. అదే కూటమి పార్టీ విజయానికి ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో... రాయలసీమలో నాలుగు జిల్లాలున్నాయి. చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు జిల్లాల్లో కేవలం ఏడు చోట్ల మాత్రమే గత ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. జగన్ మోహన్ రెడ్డి సొంత జిల్లా అయిన కడపలోనూ కేవలం మూడు స్థానాల్లోనే గెలిచింది. అనంతపురం జిల్లాలో పధ్నాలుగు నియోజకవర్గాలుంటే ఒక్క స్థానంలోనూ గెలవలే దు. కర్నూలు జిల్లాలో పన్నెండు స్థానాల్లో ఉంటే వైసీపీ రెండు స్థానాల్లో నే విజయం సాధించింది. చిత్తూరు జిల్లాలో పధ్నాలుగు స్థానాలుంటే కేవలం వైసీపీ రెండు స్థానాలకే పరిమితమయింది. మిగిలిన పన్నెండు స్థానాలను కూటమి గెలుచుకుంది. కూటమి పార్టీలు గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ కలసి పోటీ చేయడంతో పాటు అందరూ కలసి సమన్వయంతో పనిచేయడం కూడా గత ఎన్నికల్లో గెలుపునకు కారణంగా చెబుతున్నారు. అయితే మంత్రి పదవుల దగ్గర నుంచి నామినేటెడ్ పోస్టుల వరకూ కూటమి నేతల్లో అసంతృప్తి పెరిగిందంటున్నారు. అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నప్పటికీ నేతల మధ్య కీచులాటలు ప్రతి నియోజకవర్గంలో కనిపిస్తున్నాయి. మూడు పార్టీల నేతలకు నియోజకవర్గాల్లో పొసగడం లేదు. తమ వల్లనే గెలుపు సాధ్యమయిందని నమ్మిన నేతలు ఎన్నికల ఫలితాల తర్వాత తమ వారికి అన్యాయం చేసి వేరే వారికి, ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. అమరావతికి ఇక మంచి రోజులేనట నలభై నియోజక వర్గాల్లో... దీంతో రాయలసీమలోని దాదాపు నలభై నియోజకవర్గాల్లో కూటమి నేతలకు మధ్య యుద్ధం నేరుగానే జరుగుతుంది. ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి కనిపించడం లేదు. తాము సీట్లను త్యాగం చేసి కూటమి పార్టీలకు కట్టబెట్టినా వారు కేర్ చేయడం లేదన్న భావన అన్ని పార్టీల్లో నెలకొంది. దీంతో నియోజకవర్గాల్లో కూటమికి కష్టాలు మొదలయ్యాయంటున్నారు. ఇక ఎమ్మెల్యేలపై కూడా ఏడాది కాలంలోనే వ్యతిరేకత పెరగడం కూడా రాయలసీమలోనే ఎక్కువగా జరుగుతుందంటున్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కలసి రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసినా ఇక్కడ మాత్రం నేతలు ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి లేదని అధికార పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. మరోవైపు జగన్ పట్ల సానుభూతి కూడా క్రమంగా పెరుగుతుండటంతో రాయలసీమలో వైసీపీకి కొంత అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు.

# విలీన గ్రామాలకు వరం.. అమృత్ 2.0

**మహబూబాబాద్,,తెలంగాణ దిశ :**మహబూబాబాద్ పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాలకు అదనంగా నీటి సరఫరా చేసేందుకు అమృత్ 2.0 పథకంలో ప్రారంభించిన పనులు త్వరగా పూర్తయితే ఆ ప్రాంతాలకు నీటి సమస్య తీరనుంది. రాబోయే 30 ఏళ్లలో పెరుగుతున్న జనాభాకు సరిపడా తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలక సంఘాల్లో అమలు చేస్తున్న 'అమృత్ 2.0 ' ఆ ప్రాంతాలకు వరంగా మారనుంది. ఇప్పటికే పూర్వ పట్టణంలో అసంపూర్తిగా నిలిచి పోయిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేయించారు. దీనికి తోడుగా విస్తరించిన విలీన గ్రామాల్లోని అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ఈ పథకం ద్వారా రూ. 28.45 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇతర వ్యయాలు పోనూ రూ. 20.95 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు గత నెలలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కలిసి శంకుస్థాపన చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేస్తే జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీరనుంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన మిషన్ భగీరథ పథకంలో అప్పటి పూర్వ ఆరు పంచాయతీల్లో పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మించారు. అన్ని ప్రాంతాల్లో పనులు చేయలేదు. ఈ ఐదేళ్ల కాలంలో విలీన గ్రామాలు విస్తరించి జనాభా పెరిగింది. వారి అవసరాలను గుర్తించి మిగిలిన పను లను పూర్తి చేసేందుకు అధికారులు అమృత్ 2.0 పథకానికి ప్రతిపాదనలను పంపిస్తే నిధులు మంజూరయ్యాయి. అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టి వీటికి పాత ట్యాంకులు, పైపులైన్లు అనుసంధానం చేసి నీటి సరఫరా చేస్తారు. పట్టణంలోని నాలుగు, ఐదు వార్డులకు నీటిని సరఫరా చేసేందుకు పట్టణంలోని నర్సంపేట-



ఇల్లందు బైపాస్ రోడ్ సమీపాన ఉన్న గ్రీన్‌లాండ్‌లో 600 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు ఈ పైపులైన్ అనుసంధానం చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తారు. పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో రజా లిపేటకు నీటిని అందించేందుకు సాలార్ తండాలోని గుట్టపై 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి నీటిని అంది స్తారు. పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంతో పాటు భవిష్యత్‌లో విస్తరించనున్న అంబేడ్కర్ కాలనీ నుంచి ఈదులపూసపల్లి వరకు నిర్మాణమయ్యే ఇళ్లకు నీటిని సరఫరా చేయడం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేబట్టనున్నారు. నిర్మాణ పనులు ప్రారంభ మయ్యాయని వర్షాల వల్ల నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయించి నీటి సమస్యను పరిష్కరించనున్నట్లు కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ తెలిపారు.

## ఆయిల్‌పాం పెంపకం..

# రైతులకు ఆదాయం

జఫర్‌గఢ్, : వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్న ప్రధాన ఉద్దేశంతో ఆయిల్‌పాం తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగుకు తక్కువ మొత్తంలో ఖర్చు కావడం, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుండడం, తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో రైతులు ఆయిల్‌పాం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పలుచోట్ల రైతులు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తుండడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మూడేళ్ల కిందట ఆయిల్‌పాం మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు మొత్తం 5,880 ఎకరాల్లో ఆయిల్‌పాం ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా రైతులు ఇప్పటికే జిల్లాలో 200 ఎకరాల వరకు సాగుకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేలా ఉద్యానశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆయిల్‌పాం సాగు వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వంటి అంశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు రైతులకు పలు రాయితీలు ఇస్తున్నాయి. ఒక్కో మొక్క ఖరీదు రూ.193 కాగా, రాయితీ పోను రైతులు రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మొదటి ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు ఎకరానికి తోటకు వాడే ఎరువులు, పురుగు మందులు, నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ.2,100లతో పాటు అంతర పంటలు సాగు చేసుకునే వారికి మరో



రూ.2,100 చొప్పున చెల్లిస్తారు. అంటే నాలుగేళ్లలో నిర్వహణ, అంతర పంటల కోసం ఎకరానికి రూ.16,800 చెల్లిస్తారు.ఈ పంట సాగుకు బిందు సేద్యం పద్ధతిలో నీరు అందించాల్సి ఉంటుంది. ఈ బిందు సేద్యానికి కూడా రాయితీ కల్పిస్తారు. ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ఏటాఅందించే నిర్వహణ(ప్రోత్సాహక) నిధులు ఎట్టకేలకు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు రావడం, కోడ్ అమలులో ఉండడం, ప్రభుత్వం మారిపోవడంతో గత ఏడాది నుంచి నిధులు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# నిధులు కొరవడి.. పనులు చతికిలబడి!



**భూపాలపల్లి,తెలంగాణ దిశ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కోసం గత ప్రభుత్వం 2021-22లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రారంభించగా.. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మన ఊరు- మన బడి పథకం పనులను వదిలేయడంతో పనులు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. జిల్లాలో ఈ పథకం కింద మొదటి విడతగా మొత్తం 149 పాఠశాలలు ఎంపిక చేశారు. అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, ఇతర పనులు, మరమ్మతులు చేపట్టాలి. డ్యూయెల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, టేబుళు ,, కుర్చీలు, ఇలా, ఇతరత్రా సదుపాయాలు కల్పించాలి. అయితే ఎంపిక చేసిన పాఠశాలల్లో గతేడాదే పనులు పూర్తికావాల్సి ఉన్నా.. జాప్యం అయ్యాయి. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం సమయంలోనైనా పూర్తవుతాయని భావించినా పనులు పూర్తికాలేదు. ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 51 మాత్రమే.. 30పాఠశాలల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా కొన్ని ఆరంభానికి నోచుకోకపోగా.. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పాఠశాలలకు సివిల్ పనుల కింద రూ.22.86 కోట్లు, ఉపాధిహామీ పథకం కింద రూ.18.95 కోట్లు కేటాయించారు. చేసిన పనులకు ఇప్పటివరకు రూ.11.60 కోట్లు చెల్లించారు. ఇంకా చేపట్టిన రూ.2.26 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారు. ఇక్కడ అసంపూర్తిగా కనిపిస్తున్న నిర్మాణం భూపాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి పథకంలో భాగంగా నిర్మించిన డైనింగ్ హాలు, ఫ్లోరింగ్, పైపులైన్, ప్లంబర్ పనులు చేయాల్సి ఉంది, టేబుళ్లు, కుర్చీలు సమకూర్చాల్సి ఉంది. రూ.80 లక్షలు కేటాయించినా బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో పనులు ఆగిపోయాయి.

# సర్కారు భూమి స్వాహా..?

**మంచిర్యాల,తెలంగాణ దిశ** ముల్కల్ల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వాహా చేయడం విమర్శలకు తావిస్తున్నది. రెండెకరాల పట్టాభూమిని కొనుగోలు చేసి, దాని పక్కనున్న 10 గుంటల సర్కారు స్థలాన్ని కలుపుకొని ప్లాటింగ్ చేసి విక్రయించేందుకు సిద్ధమవ్వగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నది. ముల్కల్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 169లో ముగ్గురు అన్నదమ్ములకు చెందిన 71 గుంటలు, మరో వ్యక్తికి చెందిన 22 గుంటలు మొత్తం 2.13 ఎకరాల భూమిని ఇద్దరు రియల్టర్లు కొనుగోలు చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 22న అగ్రిమెంట్ సైతం చేసుకున్నారు. మొత్తంగా నలుగురు వ్యక్తుల నుంచి 2.13 ఎకరాలు కొనుగోలు చేసిన ఆ వ్యాపారులు పక్కనే ఉన్న 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని మొత్తం 42 ప్లాట్‌లు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ వేసి గజానికి రూ.13 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని ప్లాట్‌లపై అగ్రిమెంట్ చేసుకొని కస్టమర్ల నుంచి అడ్వాన్సులు సైతం తీసుకున్నారు. ఈ లెక్కన వెంచర్‌లో కలిపేసిన 10 గుంటల ప్రభుత్వ భూమిపై రూ.1.57 కోట్లు సమకూర్చుకునేందుకు స్కెచ్ వేశారని తెలిసింది. లే-అవుట్ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా డీటీసీపీ అనుమతి తీసుకోవాలి. డీటీసీపీకి దరఖాస్తు చేసుకున్నాక గ్రామపంచాయతీకి కొంత భూమిని మార్టిగేజ్ చేసి మిగిలిన ప్లాట్‌లను విక్రయించాలి. ఇలా చేస్తే టైమ్ పట్టడంతో పాటు 10 శాతం ప్లాట్లు పంచాయతీ చేతిలోనే ఉండిపోతాయి. పైగా డీటీసీపీకి పోతే ఆక్రమించే 10 గుంటల వ్యవహారం బయటపడుతుందని.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్ ఏర్పాటు చేసేశారు. మరి అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు%ొ% అలా చేయడానికి రూల్స్ ఒప్పుకోవు కదా.. అని వెంచర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే.. నాలా కన్వర్షన్ చేసి ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేపిస్తామని చెప్పారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అంతా సెట్ చేశామన్నారు. మరి అప్పుడైనా ఈ 10 గుంటల ప్రభుత్వ భూమిని ఎలా నాలా కన్వర్షన్ చేస్తారు.. అంటే రెవెన్యూ అధికారులకు సైతం




ఆమ్యామ్యాలు ముట్టచెబుతామని, అన్నింటికి కలిపే ప్యాకేజీ సెట్ చేసుకున్నామంటూ సమాధానం చెప్పారు. అంటే డీటీసీపీ అనుమతి తీసుకోకుండా అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాలా కన్వర్షన్ చేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేపిస్తారన్న మాట. ఇది ఈ ఒక్క వెంచర్‌లోనే కాదు.. జిల్లాలో ప్రతి ఇల్లీగల్ వెంచర్‌లో జరిగే ప్రక్రియనేనని తెలిసింది. జిల్లాలో ఎంక్వైరీ చేస్తే ఇలాంటి వెంచర్‌లు వందకు పైగా బయట పడే అవకాశముంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌పై గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చి ప్లాటింగ్ చేయకుండా అడ్డుకోవాలి. ఒకవేళ ప్లాటింగ్ చేసి ఉంటే ఆ వెంచర్‌లోని రోడ్లు, హద్దు రాళ్లను తొలగించాలి. కానీ విచిత్రం ఏమిటంటే ఈ ఇల్లీగల్ వెంచర్‌కు ఇప్పటి వరకు ముల్కల్ల పంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదే విషయమై ఇటీవల 'నమస్తే తెలంగాణ' పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సంప్రదించగా అనుమతులు లేకుండా చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని యాజమానులను వచ్చి కలవమని చెప్పామ న్నారు. మరి నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి కదా అని అధికారులను ప్రశ్నిస్తే.. రెండు రోజులు చూసి నోటీసులు ఇస్తామన్నారు.

# కార్మికులకు అన్యాయం చేస్తారా?

శ్రీరాంపూర్,: 'జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు సర్కారుతో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నాయి. ఒక్కో కార్మికుడికి రూ. 4 లక్షల వాటా రాకుండా చేశాయి.' అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్షణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సర్కారుకు లొంగిపోయి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. రూ. 4701 కోట్ల లాభాల్లో 33 శాతం అంటే రూ. 1551 కోట్లు కార్మికులకు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కేవలం రూ. 796 కోట్లు ఇస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దమ్ముంటే సింగరేణికి బకాయిలున్న రూ. 23 వేల కోట్లను తెప్పించాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన నిలబడి.. యాజమాన్య వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నదన్నారు. కార్మికుల కోసం సర్కారు అనుకూల సంఘాలు పోరాడ లేవని, దీనివల్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కార్మికులు గమనించాలని కోరారు. కేసీఆర్ సర్కారులో కార్మికులకు అనేక హక్కులు, సౌకర్యాలు కల్పించామని, ఆయన వల్లే ఈ రోజు 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. రాజకీయజోక్యంతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. కొందరైతే ఎమ్మెల్యేలు జీఎంలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్నేహ పూర్వక వాతావరణం ఉండేదని తెలిపారు. 33 శాతం లాభాల వాటా ఇవ్వాలని



డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గోదావరిఖని హెడ్డాఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టబోతున్నామని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ హాజరవుతారని, కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యర్శి బండి రమేశ్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర నాయకులు ముత్యాల రమేశ్, గొర్ల సంతోష్, మహిపాల్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనిధర్, కిషోర్, చిప్ప రమేశ్, తుర్రం శ్రీకాంత్, రాజేందర్, మధుకర్, చాట్ల రమేశ్ పాల్గొన్నారు.

## సోయా కొనుగోళ్లపై సీలింగ్!

# ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే సేకరణ

ఆదిలాబాద్,: ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడి ఆశా జనకంగా ఉన్నా కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో సోయా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే పాయల్‌శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానాకాలం లో 71,226 ఎకరాల్లో సోయాబిన్ పంటను సాగు చేశా రు. సీజన్‌లో 4,27,356 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది రైతులు ఊహించిన విధంగా ఎకరాకు 8 క్వింటాళ్లకుపైగా పంట దిగుబడులు వచ్చాయి. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఎకరాకు 6 క్వింటాళ్లు మా త్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. అదనంగా దిగుబడి వచ్చిన పంటను విక్రయించేందుకు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి ఉంటుంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4892 ఉండ గా ప్రైవేట్ వ్యాపారులు రూ.4300 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.600 వరకు న ష్టపోవాల్సి వస్తున్నది.



పంట కొనుగోళ్లలో కోతలు విధించడం, తేమ, పంట నాణ్యత పేరిట ధరలు తగ్గిస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట కొనుగోలులో సీలింగ్ ఎత్తివేయాలని రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభు త్వం జిల్లాలో నాఫెడ్ ద్వారా సోయాబిన్ పంట కొనుగోళ్లను ఏర్పాటు చేసి ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున మాత్రమే సేకరిస్తామని అంటున్నారు. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం సరికాదు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన సోయాను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు సేకరించాలి. సోయాబిన్‌లో సహజంగా ఎక్కువ తేమ ఉంటుంది.

# డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**ఎదులాపురం,తెలంగాణ దిశ :** ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలట్ ప్రాజెక్టు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని వార్డు నంబర్ 11, 12లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారాన్ని సేకరించడంతో సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని, తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, మావల తహసీల్దార్లు శ్రీనివాస్, వేణు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్ షానవాజ్, తదితరులున్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ఆడెగాం(బీ) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు, వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు చదవడం, రాయడం నేర్పాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని సూచిం చారు. అనంతరం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సర్వేను పరిశీలించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కో సం పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మల్ పట్టణం 42 వ వార్డు(చింతకుంట)లోనిర్వహించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ఆడెగాం(బీ) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు, వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు.

కుటుంబాల ఆధారం గా సర్వే చేస్తున్నామని కొత్త కుటుంబాల వివరాలను ఆధార్ కార్డు ద్వారా నమోదు చేస్తున్నట్లు సర్వే బృందం కలెక్టర్‌కు వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో సర్వేలో తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల బాండ్లపై తీర్పు తిరగదోడే ప్రసక్తే లేదు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తిరగదోడే ప్రసక్తే లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ బిఆర్ గవారు, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. న్యాయవాది మాథ్యూస్ నెడుంపరా, మరొకరు ఈ పిటిషన్లు వేశారు. 'రివ్యూ పిటిషన్లను పరిశీలించిన మీదట రికార్డులో ఎలాంటి పొరపాటు లేదని కనిపిస్తోంది. సుప్రీం కోర్టు నియమావళి-2013లోని ఒకటో క్లాజ్‌లోని 47వ నిబంధన కింద తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు. అందువల్ల రివ్యూ పిటిషన్లను తోసిపుచ్చుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో అజ్ఞాత ఎన్నికల బాండ్ల పథకానికి మార్గం సుగమం చేస్తూ ద్రవ్య చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపన్ను చట్టాలకు చేసిన 2018 సవరణలు రాజ్యాంగ విరుద్ధమంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజకీయ పార్టీలకు వచ్చే నిధులు, విరాళాలు ఎక్కడ నుండి వస్తున్నాయో తెలుసుకునే ప్రాథమిక హక్కు ఓటరుకు వుందని, ఈ పథకం ఆ హక్కును కాలరాస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్లు జారీ చేసే భారతీయ స్టేట్‌బ్యాంక్

వెంటనే బాండ్ల కొనుగోలుదారులు, తీసుకున్నవారి వివరాలను వెల్లడించాలని కూడా కోర్టు ఆదేశించింది.. ఎన్నికల బాండ్ల పథకం బిజెపి రాజకీయ అవినీతి పథకంగా మారింది. దాతలు అజ్ఞాతంగా రాజకీయ పార్టీకి నిధులు పంపడానికి ఈ పథకం అనుమతిస్తున్నది. దీంతో ఇడి, సిబిఐ, ఐటిలను పావులుగా వాడుకుని కంపెనీలను బెదిరించి ఎన్నికల బాండ్ల రూపంలో ముడుపులు పెద్దయెత్తున బిజెపి ఖాతాలో జమ కావడానికి ఇది లాకులెత్తింది.

# కొనుగోళ్లు లేక 'బర్లీ' రైతు బెంగ



మంగళ సూత్రాలను తాకట్టు పెట్టాను. ఎరువులు, పురుగు మందులు అన్నీ అప్పులే. చివరికి చెవి దిద్దులు, ముక్కుపుడక తాకట్టు పెట్టి కూలి డబ్బులు ఇచ్చాము. ప్రతి సంవత్సరం కొంతమంది కూలీలు కూడా డబ్బులు ఇవ్వలేక మొహం చాటేస్తున్నాం. తాకట్టు పెట్టిన బంగారం వెంటనే విడిపించుకోకపోతే బంగారం ఇచ్చేదిలేదని తాకట్టు పెట్టుకున్న వ్యాపారి కబురు చేశారు. ఇళ్లల్లో పొగాకు, రోడ్ల మీద మనుషులు, పశువులు, జీవాలు.. ఇవి బాపట్ల జిల్లా పర్చూరు, ఇంకొల్లు మరికొన్ని చుట్టుపక్కల మండలాల్లోని గ్రామాలన్నిటిలో బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి.

రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాలకు పైగా నల్ల బర్లీ పొగాకు వేశారు. వీరిలో 80 శాతం పైగా కౌలు రైతులే ఉన్నారు. గత రెండు సంవత్సరాల్లో తెగుళ్లు వచ్చి మిర్చి వేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు గత సంవత్సరం నల్ల బర్లీ పొగాకు పంట క్వింటా రూ.15 నుండి రూ.18 వేలకు అమ్ముడుపోయింది. చివరకు అడుగులు (నాసిరకంగా వున్నా) కూడా రూ.12 వేలకు బంగారం లాగా వ్యాపారులు కళ్ళకు అద్దుకుని కొనుక్కుపోయారు.

అలాగే జి.పి.ఐ, ఐ.టి.సి తదితర కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు ఒకటికి నాలుగు సార్లు గ్రామాలకు, రైతుల చుట్టూ తిరిగి మొత్తం పొలమంతా నల్ల బర్లీ పొగాకు వేయమని ప్రోత్సహించారు. 'కొంత నల్ల బర్లీ, మరికొంత వైట్ బర్లీ పొగాకు లేదా మిర్చి వేస్తారేమో.. అలా వేయొద్దు. మొత్తం నల్ల బర్లీ వేయండి' అని చెప్పారు. పైగా గత సంవత్సరం రేటు మరో రెండు మూడు సంవత్సరాలు నిలకడగా ఉంటుందని వ్యాపారులు వారికి భరోసా ఇచ్చారు. దానితో కౌలు రేట్లు పెరిగినా లెక్క చేయకుండా పొలాన్ని కౌలుకు తీసుకున్నారు.

రెగ్యులర్‌గా కౌలు చేసే వారే కాకుండా ఈ మధ్యకాలంలో సంచార జాతులుగా చెప్పుకునే యానాది, ఎరుకల తదితర సామాజిక తరగతులకు చెందిన పేదలు కూడా పొలాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశారు. పంట బాగా పండితే గత సంవత్సరం లాగా ధర వస్తే అప్పులన్నీ తీర్చుకోవచ్చు. అప్పుల నుండి బయటపడి ఊపిరి పీల్చుకుందామనుకున్నారు. కానీ నల్ల బర్లీ పొగాకు వేసిన రైతులు, కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. కౌలు రేట్లు రూ.25 వేల నుండి రూ.35, 40 వేల వరకు పెరిగింది.

పొగాకు గుచ్చటానికి రూ.40 వేలు, ట్రాక్టర్‌తో దుక్కికి రూ.10 వేలు, ఎరువు లకు రూ.10 వేలు అవుతోంది. 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా పంట పండించుకోవడానికి నీళ్లకు కనీసం రూ.10 వేల రూపాయలు ఖర్చు చేశారు. ఎద్దులతో సాళ్ళ ఏర్పాటుకు రూ.5000, నారుకు రూ.పది వేలు ఇతరత్రా అన్నీ కలుపుకుని ఎకరాకు సాగు చేయడానికి రూ.1,50,000 పైనే ఖర్చు అయింది. గత సంవత్సరం ఎకరాకు సరాసరిన 18 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడి కూడా తగ్గింది. ఈ సంవత్సరం సగటున పది నుండి 13 క్వింటాళ్ళ దిగుబడి ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు.

గత సంవత్సరం అత్యంత ఎక్కువ ధర పొందిన నల్ల బర్లీ పొగాకు రైతుల పరిస్థితి తారుమారైంది. గత సంవత్సరం క్వింటా రూ.18,000 ధర వస్తే నేడు అదే పంట కేవలం రూ.3000 మాత్రమే ధర పలుకుతున్నది. కొన్ని ప్రాంతాలలో అసలు కొనలేమని ప్రకటించి వ్యాపారులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పొగాకును పరిశీలించి నాణ్యత, తేమ శాతం అన్నీ సక్రమంగా ఉన్నాయని పాస్ చేసి మళ్లీ తిరస్కరిస్తున్నారు. జనవరి నుండి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కావటం ఆనవాయితీ. కానీ ఈ సంవత్సరం ఆ ఆనవాయితీ దాటి 120 రోజులు గడిచినా పట్టించుకునే దిక్కుమొక్కు లేక రైతులు పొగాకు ఎలా అమ్ముకోవాలా అని ఎదురు చూస్తున్నారు. కంపెనీలు, దళారులు కుమ్మక్కై బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. మీరు ఆందోళన చేస్తే ధర మరింత తగ్గుతుంది. కొనటం ఇంకా ఆలస్యం అవుతుందని కంపెనీల ఏజెంట్లతో ప్రచారం చేయిస్తున్నారు.

పర్చూరు మండలం చిన్న నందిపాడు గ్రామంలో పంట రుణాలు కట్టాలంటూ బ్యాంక్ అధికారులు లాయర్ నోటీసులు పంపించారు. ఐదుగురు సభ్యులున్న జాయింట్ లయబిలిటీ గ్రూపు రూ.2.5 లక్షలు అప్పు తీసుకుంటే నేడు అసలు, వడ్డీ కలిపి రూ.4.74 లక్షలైంది. కట్టకపోతే కోర్టుకు ఈడుస్తామని న్యాయవాదులతో నోటీసులు పంపించారని ఆ గ్రామ కౌలు రైతులు సింగారావు, కోట మరియదాసు, కట్టా సూర్యం తెలిపారు. చెవి పోగులు, ముక్కు దిద్దులు, మెడలో ఉన్న మంగళ సూత్రాలు తాకట్టుపెట్టి కూలి డబ్బులు చెల్లించామని దగ్గుపాడు గ్రామస్తులు ఫకీర్ సాహెబ్, పెద్ద సుబ్బయ్య చెప్పారు. అయితే తాకట్టు పెట్టుకున్న వ్యాపారి గడువు అయిపోతున్నదని వెంటనే డబ్బులు కట్టి బంగారం విడిపించుకోకపోతే మీ బంగారం మీకు దక్కదని వ్యాపారులు కబురు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కొంత పొగాకు, కొంత మిర్చి వేసే వాళ్ళం. ఏదో ఒక పంట ముందు అమ్ముకుని కూలి డబ్బులిచ్చి అప్పులు కొంతైనా తీర్చుకునే వాళ్ళం. కంపెనీ వాళ్ళు చెప్పిన మాట నమ్మి అంతా బ్లాక్ బర్లీ పొగాకు వేసి కూలి డబ్బులు కూడా ఇవ్వలేకపోతున్నాం. అప్పుల వాళ్ళు మీద పడుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని వంకాయలపాడు గ్రామానికి చెందిన రామలింగారెడ్డి వెంకట్రెడ్డి, కొండయ్య, రఘు, మురళి తదితరులు దిగాలుగా చెప్పారు.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల కోసం బడ్జెట్లో కేటాయింపులు సున్నా చేయటం. అలాగే కంపెనీలు కుమ్మక్కై ధరలు పడవేయటం. కంపెనీల మాయాజాలాన్ని కంట్రోల్ చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీలకు తలొగ్గాయి. పొగాకు సాగు చేసిన రైతుల్ని పట్టించుకోలేకపోయాయి. కంపెనీలకు అవసరమైన అనేక సౌకర్యాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. పంటలు సాగు చేస్తున్న రైతులకు కౌలు రైతులకు హామీ ఇచ్చినట్లు అన్నదాతా సుఖీభవ డబ్బు రూ.20 వేలు రైతుల ఖాతాల్లో నేటికీ జమ చేయలేదు. పాత కౌలు చట్టాలను రద్దు చేసి కొత్త కౌలు చట్టం తీసుకొచ్చి కౌలు రైతులకు రక్షణగా ఉంటామన్న హామీ ఇంతవరకు ఆచరణ రూపం దాల్చలేదు. పాత ప్రభుత్వం టెక్నాలజీని సరిగా ఉపయోగించలేదని పంటను కాపాడుకోవడానికి అవసరమైన పరికరాలు, పరదాలు ఏమీ ఇవ్వలేదు.

అవన్నీ ఇచ్చి రైతన్నను ఆదుకుంటానన్న హామీ నీటి మీద రాతగానే ఉండిపోయింది. పొగాకు పండించిన రైతులను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. అన్ని రకాల పొగాకు పంటలను పొగాకు బోర్డు పరిధిలోకి కేంద్రం తీసుకురాలేకపోవడంతో ప్రభుత్వాలు కంపెనీలను నియంత్రించటం కాకుండా కంపెనీలే ప్రభుత్వాలను, మంత్రులను కంట్రోల్ చేస్తున్నాయి. ఫలితంగా ఈ సంవత్సరం నల్ల బర్లీ పొగాకు పండించిన రైతులు, కౌలు రైతులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. కళ్ళ ముందు అన్నీ ఉన్నా తినడానికి మనసు రాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, గాలులు, చిన్నచిన్న వర్షాల వల్ల మానసిక ధైర్యాన్ని కూడా కొద్ది కొద్దిగా కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, సభ్య సమాజం మనకందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు అండగా ఉండాలి. రైతాంగం కూడా ఒకరికొకరు చేయి కలిపి ఐక్యమై ఆందోళనే ఆయుధంగా పోరాడాలి. ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ఐక్యంగా కదిలి నల్ల బర్లీ పొగాకు కనీసం గత సంవత్సరం రేటయినా సాధించుకోవాలి. ఆందోళన పోరాటాలలో రైతులు, కౌలు రైతులు పాల్గొని ప్రభుత్వాల మొండితనాన్ని, కంపెనీల దోపిడిని ఎదుర్కోవటానికి పోరాటమే పరిష్కారంగా ముందుకు రావాలి.

# అమరావతి రైతులు, మహిళలకు గొప్ప అవకాశం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ వచ్చే నెల 2వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. అయితే ఈ సందర్భంగా అమరావతిలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కార్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇక ప్రధాని సభలో రాజధాని ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 3 రాజధానుల ప్రకటన చేసిన తర్వాత.. అమరావతి ప్రాంత రైతులు, మహిళలు చేసిన అసమాన పోరాటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని.. 3 ఏళ్లకు పైగా నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. దీంతో మళ్లీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గతంలో 2014లో అమరావతి ప్రారంభోత్సవానికి పునాది రాయి వేసిన ప్రధాని మోదీ.. ఇప్పుడు మరోసారి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోనున్నారు. ఈ క్రమంలోనే అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మే 2వ తేదీన ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ రానున్నారు. అమరావతి రాజధాని, సీఆర్డీఏ పరిధిలో సుమారు రూ.లక్ష కోట్లతో చేపట్టే పనులకు నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. అదే సమయంలో భారీ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. అయితే సభస్థలి వద్ద మొత్తం 3 వేదికలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో అమరావతి ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు. 3 వేదికల్లో ఒకదానిపై 30 మంది అమరావతి రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను కూర్చునేందుకు అవకాశం కల్పించనున్నారు. 5 లక్షల మంది రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏపీ సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రధాని మోదీ.. హెలిప్యాడ్ దిగిన తర్వాత అక్కడి నుంచి సభాస్థలానికి చేరుకునే వరకు 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ, పోలీస్ అధికారులతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. వాహనాలు, జనం రద్దీని నియంత్రించడం.. పార్కింగ్ సమస్యలను పరిష్కరించడంపై అధికారులకు నారాయణ సూచనలు చేశారు. మే 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతిలో పర్యటించిన సీఎం చంద్రబాబు వెంటనే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తై పనులు కూడా ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం రాజధాని అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

## అమల్లోకి హెచ్‌ఎండీఏ బిల్డ్ నౌ సేవలు..!

హైదరాబాద్: భవన నిర్మాణలు, లేఔట్ల అనుమతుల మంజూరు విషయంలోతెలంగాణ ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు తీసుకువచ్చింది. వేగంగా, సులభంగా అనుమతులు పొందేలా 'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలను ప్రవేశపెట్టింది. మొదట్లో జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఈ సేవలు అందబాటులో ఉండగా? తాజాగా హెచ్‌ఎండీఏ పరిధిలోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి. టీజీ - బీపాస్ ద్వారా భవన నిర్మాణాలు, లేఔట్లకు అనుమతులు వచ్చేవి. అయితే ఇందులో ఇబ్బందులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడంతో పాటు అత్యంత వేగంగా అనుమతులు ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' వ్యవస్థను తీసుకువచ్చింది. తొలుత ఈ విధానాన్ని జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలు చేయగా.. సత్ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఈ అప్లికేషన్ ప్రత్యేకతలు, వివరాలెంటో ఇక్కడ తెలుసుకోండి?.

'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలు - ముఖ్యమైన అంశాలు:రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' అనే అప్లికేషన్ తీసుకువచ్చింది. ఈ అధునాతన అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

ముందుగా ఈ సేవలను జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలు చేశారు. దీని ద్వారానే దరఖాస్తులను స్వీకరించి? భవన నిర్మాణ అనుమతులను మంజూరు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆటోమేషన్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేయడమే 'బిల్డ్ నౌ' సేవల ముఖ్య ఉద్దేశ్యం.

ప్రస్తుతం ఊఓఆం పరిధిలోనూ ఈ అప్లికేషన్ ద్వారానే అనుమతులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన్సిపాలిటీల్లోనూ ఈ సేవలు అమలు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ అప్లికేషన్ ద్వారా వేగంగా ప్రాసెస్ పూర్తవుతుంది. అనుమతి ప్రక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ ఫేస్ అని అధికారులు చెబుతున్నారు. గతంలో భవన నిర్మాణ అనుమతులు వారం నుంచి నెలరోజుల్లో వచ్చేవి. అయితే ఈ అప్లికేషన్ ద్వారా అత్యంత వేగంగా? నిమిషాల వ్యవధిలోనే ఔట్ పుట్ ఉంటుంది. టీజీబీపాస్‌లో ఇన్‌స్టంట్ అప్రూవల్‌కు, మిగతా అనుమతులకు వేర్వేరు విండోస్ ఉండేవి. కానీ బిల్డ్ నౌలో అన్నింటికీ ఒకే విండోతో త్వరితగతిన అనుమతులు జారీ అవుతాయి. భవన నిర్మాణం పూర్తయ్యాక ఎలా ఉంటుందో కూడా త్రీడీలో డిస్ ప్లే అవుతుంది. ఇప్పటి వరకు డ్రాయింగ్స్ పరిశీలనకే ఎక్కువ రోజులు పట్టేది. కానీ ఎలాంటి భవనాలకైనా ఈ కొత్త అప్లికేషన్ ద్వారా నిమిషాల్లోనే పరిశీలన పూర్తవుతుంది. ప్రతి అప్లికేషన్ ను ధృవీకరించి ట్రాక్ చేసేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ అవకాశం కల్పిస్తుంది. ఎలాంటి లోపాలు లేకుండా పని చేసేలా ఈ బిల్డ్ నౌ అప్లికేషన్ ను రూపొందించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నీ బిల్డ్ నౌతో అనుసంధానమై ఉంటాయి.


# భారీగా తగ్గిన ఉల్లిపాయల ధరలు



హైదరాబాద్: రాష్ట్రంలోని మధ్య తరగతి ప్రజలకు శుభవార్త. ప్రతిఒక్కరి ఇంట్లో నిత్యావసరాల వస్తువుల జాబితాలో ఉల్లిపాయలు కూడా ఉంటాయి. అయితే, ఇటీవల కాలంలో ఉల్లిపాయ ధరలు భారీగా పెరిగాయి. గత నెలలో హోల్ సేల్ మార్కెట్లో కిలో ఉల్లిగడ్డలు రూ. 40 నుంచి రూ.50 వరకు విక్రయాలు చేశారు. దీంతో పేద వర్గాల ప్రజలు తమ వంటల్లో ఉల్లిపాయను దూరం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ప్రస్తుతం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. కొత్త పంట మార్కెట్ కు వస్తుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ధరలు సగానికి తగ్గిపోయాయి. ప్రస్తుతం కిలో ఉల్లిగడ్డ ధర రూ. 15 నుంచి రూ.20 వరకు విక్రయాలు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లోని మెయిన్ హోల్ సేల్ మార్కెట్లు అయిన ఉస్మాన్ గంజ్, మలక్ పేట, సికింద్రాబాద్ మోండా, బోయిన్ పల్లితోపాటు పలు రైతు బజార్లకు పెద్దెత్తున ఉల్లి వస్తుంది. దీంతో ధరలు పడిపోతున్నాయి. మహారాష్ట్ర, కర్నూల్ నుంచి ఉల్లి ఎక్కువగా దిగుమతి అవుతుంది.

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా పరిధిలోని తాండూరు, మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, అలంపూర్, నల్గొండ తదితర ప్రాంతాల్లో 40వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతుంది. ప్రతీయేటా ఏప్రిల్, మే నెలల్లో పంట చేతికి వస్తుంది. దీంతో మార్కెట్లకు ఉల్లిగడ్డలు భారీగా వస్తున్నాయి. హైదరాబాద్ సిటీలోని మార్కెట్లకు రోజుకు 15వేల నుంచి 18వేల క్వింటాళ్లు ఉల్లిగడ్డలు వస్తున్నాయి. మరోవైపు ఉల్లిపై 20శాతం ఎక్స్ పోర్ట్ ట్యాక్స్ ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కారణంగానూ ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.

## రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



జయశంకర్ భూపాలపల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని రూపురెడ్డిపల్లి మరియు దామరంచపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతాలు, తరుగు పేరిట రైతులకు ఇబ్బందులు కలిగించకూడదని స్పష్టం చేశారు. ప్రతి బస్తా 40 కిలోల ధాన్యానికి గరిష్టంగా 650 గ్రాముల బస్తా తూకమే అనుమతించబడుతుందని, దీనికన్నా అధికంగా తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వ విధానాలను సమర్ధంగా అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ సర్జరీ వీడియో షేర్ చేసిన అషూ రెడ్డి...



జూనియర్ సమంతగా గుర్తింపు తెచ్చుకొని ఆ తర్వాత బిగ్ బాస్ షోతో మంచి పాపులారిటీ తెచ్చుకున్న అందాల భామ అషూ రెడ్డి. కొన్నేళ్లపాటు యాంకర్‌గానూ రాణించిన ఈ భామ రామ్ గోపాల్ వర్మతో రచ్చ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక సోషల మీడియాలో ఈ అమ్మడు చేసే సందడి మాములుగా ఉండదు. కేక పెట్టించే అందాలతో కుర్రకారుని తనవైపుకి తిప్పుకుంటుంది. ఛల్ మోహనరంగ, బాయ్‌ఫ్రెండ్ ఫర్ హైర్, ఎ మాస్టర్ పీస్ వంటి చిత్రాలలోను నటించి అలరించింది. అయితే అషూ రెడ్డి బయటకి ఆనందంగా కనిపించిన ఆమె చావు చివరి అంచు వరకు వెళ్లి వచ్చిందన్న విషయం చాలా మందికి తెలియదు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అషూ రెడ్డి బ్రెయిన్ సర్జరీ చేయించుకుంది. ఆ విషయాన్ని ఇటీవల ఇంటర్వ్యూలో తెలియజేసింది. అయితే తాజాగా ఇన్ స్టా ద్వారా ఓ వీడియో షేర్ చేస్తూ.. తాను ఆ సమయంలో ఎన్ని కష్టాలు పడిందో తెలియజేసింది. ఆ వీడియో చూస్తే ఎవరికి కన్నీళ్లు ఆగడం లేదు. అషూ కూడా కన్నీళ్లు పెట్టుకోవడం మనం వీడియోలో చూడవచ్చు. హాస్పిటల్ బెడ్ పై తీసిన ఆ షాట్స్, తలపై మెడికల్ బ్యాండేజీ, షేవ్ చేసిన హెయిర్ లైన్.. ఇవన్నీ ప్రతి ఒక్కరిని కదిలిస్తున్నాయి. వీడియోకి క్యాప్షన్‌గా అషూ రెడ్డి.. లైఫ్ అంటే ఇదే.. దయతో ఉండండి, గొప్పలకు పోకుండా ఉండండి. ఇది ఎంతో మందిని కాపాడుతుంది. నా చుట్టూ ఉండి నేను కోలుకునేలా, ప్రార్థించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అంటూ అషు రెడ్డి తన పోస్ట్‌లో తెలియజేసింది. చిరంజీవి నటించిన శంకర్ దాదా సినిమాలోని 'ఓడిపోవడం తప్పు కాదురా' అనే లిరిక్స్ ను ఆ వీడియోకు యాడ్ చేసి పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. బ్రెయిన్ సర్జరీ నుంచి విజయవంతగా బయటపడినందుకు కొందరు కంగ్రాట్స్ చెబుతుండగా, మరి కొందరు ఆరోగ్యం విషయంలో కేర్ తీసుకోమని కామెంట్ చేస్తున్నారు.

# తొలి భారత సెలబ్రిటీగా రానా..




తద్వారా రెజిల్‌మేనియాకు వెళ్లి తొలి భారత సెలబ్రిటీగా రానా నిలిచారు. ఆయన్ను ఆహ్వానించిన ఈవెంట్ నిర్వాహకులు ముందు వరుస సీటింగ్‌ను కేటాయించారు. కార్యక్రమం జరుగుతున్నప్పుడు రానా పేరును కూడా వారు అనౌన్స్ చేయడం విశేషం. కాగా, ఈ ఈవెంట్‌కు రానా తన వెబసిరీస్ 'రానా నాయుడు' సీజన్-2 ప్రమోషన్‌లో భాగంగా వెళ్లినట్లు తెలుస్తోంది.

రెజిల్‌మేనియా ఈవెంట్ ప్రపంచవ్యాప్తంగా జరిగిన ప్రత్యక్ష ప్రసారంలో రానా కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది.

ఇక 'రానా నాయుడు' సీజన్-2 ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో త్వరలో ప్రసారం కానుంది. ఇందులో భాగంగా నిర్మాతలు ప్రమోషన్‌లను ప్రారంభించారు.

'రానా నాయుడు'లో రానా బాబాయ్ విక్టరీ వెంకటేశ్ కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కరణ్ అన్షుమాన్ ఈ సిరీస్ కి దర్శకత్వం వహించారు.


# ఫౌజీ బడ్జెట్ 700కోట్లు?




ప్రభాస్ 'ఫౌజీ' సినిమా బడ్జెట్ అక్షరాలా 700కోట్లట. ఆ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి ఓ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. 'నాకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ కోసం ప్రత్యేకంగా నెలరోజుల క్రితం ట్రయల్ షూట్ నిర్వహించారు. అనుకోకుండా ఆ షూట్‌లో నా చేయి ఫ్రాక్చర్ అయ్యింది. దాంతో నెలరోజులు రెస్ట్ తీసుకున్నా. ఈ నెల చివరి నుంచి డేట్స్ ఇచ్చా. నాకోసం ప్రభాస్ తన డేట్స్ మార్చుకుని, ఈ నెల చివరి నుంచి నాతోపాటు ఆయన కూడా షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. అంత పెద్ద స్టార్ అలా చేయడం నాకెందుకో హార్ట్ టచింగ్‌గా అనిపించింది. 'ఫౌజీ' అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న సినిమా. ఈ ప్రాజెక్ట్‌కి దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు' అని తెలిపారు మిథున్ చక్రవర్తి.

ఇదిలావుంటే.. కొన్ని రోజుల క్రితం షూటింగులన్నింటికీ బ్రేక్ ఇచ్చేసి వెకేషన్ అంటూ ఇటలీ వెళ్లారు ప్రభాస్. మూడ్నాలుగు రోజుల్లో మళ్లీ ఆయన తిరిగి ఇండియా చేరుకోనున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నటిస్తున్న ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ప్రభాస్ ఇండియా రాగానే వీటి షూటింగులపై క్లారిటీ రానుంది. మిథున్ మాటలను బట్టి ఆయన ముందు 'ఫౌజీ' సెట్‌లోకి ఎంటరవుతారని అర్థమవుతోంది.


# 3000 మంది ఆర్టిస్టులతో




కథానాయకుడు మహేష్‌బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హాలీవుడ్ మూవీ 'ఎస్ఎస్ఎంబి 29'. ఫిబ్రవరి రెండోతేదీన ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆ తర్వాత ఒరిస్సాలో మొదటి షెడ్యూల్ పూర్తయ్యింది. కాశీని తలపించే సెట్స్‌లో చిత్రీకరణ జరగ్గా..ప్రియా ంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. వీటికి సంబం ధించిన ఫొటోలు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లో జరగబోయే రెండో షెడ్యూల్‌లో మహేష్, ప్రియాంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతోపాటుగా 3000 మంది జూనియర్ ఆర్టిస్టులతో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించబోతు న్నారు. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఈ సీక్వెన్‌ను తెరకెక్కించబోతున్నారు. ఈనెలాఖరులో రిహార్సల్‌పూర్తిచేసి ఆ తర్వాత షూటింగ్ పూర్తిచేస్తారు. 'వన్ నేనొక్కడినే' మూవీలో ఉన్నట్లుగా ఈ సినిమాలో కూడా బోట్ ఛేజింగ్ సీన్ కూడా ఉంటుందని సమాచారం. దీనికి సంబంధించిన ఏర్పాట్లలో టెక్నీషియన్లు నిమగమైఉన్నారు. ఇప్పటికే పలు హాలీవుడ్ ఏజెన్సీలతో ఒప్పందాలు కూడా చేసుకోవటంతో ఆయా సంస్థలకు చెందిన టెక్నీషియన్లు ఈ మూవీ కోసం ఇప్పటికే పని ప్రారంభించారు.

సముద్రంలో జరిగే ఫైట్ సీక్వెన్స్ ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుందని, దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ కూడా అదిరిపోయేలా ఉంటాయనే చర్చ ఇండిస్టీలో బాగా జరుగుతోంది.

# నేను ఇండస్ట్రీకి దూరం కావడానికి కారణం ఇదే



టాలీవుడ్ లోనే కాదు...కోలీవుడ్ లో సైతం స్టార్ గా కొనసాగిన ఘనత మన తెలుగు అమ్మాయి రంభది. విజయవాడకు చెందిన రంభ అసలు పేరు విజయలక్ష్మి. స్క్రీన్ నేమ్ ను రంభగా మార్చుకుంది. అప్పట్లో దాదాపు అందరు టాప్ హీరోలతో ఆమె నటించింది. బాలీవుడ్‌లో సైతం మెరిసింది.

చివరగా 'దేశముదురు' సినిమాలో ఐటెం సాంగ్ లో కనిపించింది. ఆ తర్వాత పెళ్లి చేసుకుని కెనడాలో సెటిల్ అయిపోయింది. తాజాగా ఆమె సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. ఓ టీవీ షోలో జడ్జ్ గా కనిపించింది. సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయిపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రంభ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. పెళ్లి తర్వాత తాను కెనడాలో స్థిరపడ్డానని రంభం తెలిపింది. ఒక తల్లిగా పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని... అందుకే సినిమాలకు దూరమయ్యానని చెప్పింది. తనకు ఆరేళ్ల బాబు, 14, 10 ఏళు ఉన్న ఇద్దరు అమ్మాయిలు ఉన్నారని... ప్రస్తుతం వారి పనులు వారు చేసుకోగలుగుతున్నారని తెలిపింది. తనకు సినిమాలపై ఉన్న ఆసక్తి గురించి తన భర్తకు తెలుసని... అందుకే మళ్లీ సినిమాల్లో నటిస్తానంటే ఆయన ఒప్పుకున్నారని చెప్పింది.

ఒక డ్యాన్స్ షోకు జడ్జిగా చేశానని... ఆషో చేయడానికి తొలుత భయపడ్డానని... కానీ, అంతా హ్యాపీగా జరిగిపోయిందని రంభ తెలిపింది. ప్రేక్షకుల చప్పట్లు తనలో ఉత్సా హాన్ని నింపాయని చెప్పింది. తాను మళ్లీ నటించడానికి రెడీగా ఉన్నానని తెలిపింది. తనతో కలిసి నటించిన చాలా మంది ఇంకా ఇండస్ట్రీలో ఉన్నారని... వారి సహకారం కూడా తనకు ఉంటుందని చెప్పింది. ప్రస్తుతంతన చేతిలో కొన్ని ఆఫర్ లు ఉన్నాయని... త్వరలోనే తాను నటించబోయే సినిమా గురించి వెల్లడిస్తానని తెలిపింది.

# మహిళలూ.. ఈ పోషకాలు అందేలా చూసుకోండి!

గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళలకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమ వుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి.

యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి: చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితం గా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్డు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్ఒ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, షిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయప డుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్-ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్-ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

# వాల్‌స్ట్రీట్ బెంబేలు..!

## పోటీపై దృష్టి పెట్టాలి : ట్రంప్




న్యూఢిల్లీ: అమెరికాలోని దిగ్గజ కృత్రిమ మేధా (ఎఐ) కంపెనీలకు దీటుగా చైనాకు చెందిన డీప్‌సీక్ అత్యంత ప్రభావవంతమైన ఎఐ మోడల్‌తో గణనీయమైన పురోగతిని సాధించింది. డీప్‌సీక్ తన దూకుడుతో వాల్‌స్ట్రీట్‌లోని పశ్చిమ దేశాల ఎఐ కంపెనీలకు వణుకు పుట్టిస్తోంది. ఆయా కంపెనీల షేర్లు కుదేలవుతున్నాయి. ఈ రంగంలో అమెరికా, చైనా తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఇందులో భారత్ చొరవ చాలా పేలవంగా ఉందని టెకీల నుంచి విమర్శలు పెరిగాయి. బహుభాషల్లో ఆవిష్కరించిన డీప్‌సీక్ ఎఐలో ప్రధాన సంస్థగా నిలుస్తోంది. పూర్తి అడ్వాన్స్ ఎఐ మోడల్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తుండడం విశేషం. పశ్చిమ దేశాలతో పోల్చితే అతి తక్కువ ఖర్చుతో దీన్ని అభివృద్ధి చేసింది. ఈరంగంలో తమకు పోటీ లేదనుకున్న వేళ డీప్‌సీక్ దూకుడు అమెరికాకు మింగుడుపడటం లేదు. డీప్‌సీక్ పురోగతిపై ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. ఇది అమెరికన్ కంపెనీలకు మేల్కొలుపు కావాలని అన్నారు. ఈ ఆటలో గెలవడానికి పోటీ పడాలని తమ దేశ సంస్థలకు సూచించారు. డీప్‌సీక్‌ను ఓపెన్‌ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మాన్ కూడా ప్రశంసించారు. తమకు కొత్త పోటీదారు రావడం ఉత్తేజకరమని ఆల్ట్‌మాన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. డీప్‌సీక్ సూపర్ హిట్ కావడం ఈ సాంకేతిక పురోగతిపై భారత్ సహా ఇతర దేశాలు ఎలా స్పందిం చాలనే దానిపై ఉత్సుకత, చర్చలకు దారితీసింది. భారత్‌కు చెందిన ఎఐ స్టార్టప్ అయిన సర్వమ్ ఎఐ 0 కోట్ల అంశాలతో ఓ వేదికను అభివృద్ధి చేస్తోంది. ఇది భారతీయ భాషల్లో రానుంది.

డీప్‌సీక్ మోడల్ ఏకంగా 67,100 కోట్ల అంశాలతో అభివృద్ధి చేయబడింది. ఎఐలో భారత్ రాణించడానికి కావాల్సిన మూలధనం, ప్రతిభ, సామర్థ్యం ఉందని జులియా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ కో–ఇన్వెంటర్ విరాల్ షా పేర్కొన్నారు. ప్రముఖ గ్లోబల్ వెంచర్ క్యాపిటల్ సంస్థలు భారత్‌లో కార్యాలయాలను స్థాపించాయని, ఎన్విడియా, ఇంటెల్ చిప్‌లలో ఎక్కువ భాగంగా భారత్‌లోనే రూపొందించబడ్డాయని అన్నారు. ఎఐ కోసం సమయం పడుతుందన్నారు.

వ్యాపార సౌలభ్యాన్ని మెరుగు పరచడం, ఉన్నత విద్యను మెరుగుపరచడం, డీప్‌టెక్‌పై ఆర్అండ్‌డి పెట్టుబడిని పెంచడం ద్వారా మన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి మొత్తం పర్యావరణ వ్యవస్థ కలిసి రావాలన్నారు. భారతీయ పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు, వెంచర్ క్యాపిటలిస్టులు ఎఐలో బలమైన ఉనికిని సాధించడానికి కొత్త ఆలోచనలతో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

గ్లోబల్ ఎఐ రేస్‌లో సామర్థ్యం గల మోడల్‌లను అభివృద్ధి చేయడానికి భారత్ ప్రధాన పరిశోధనలో మరింత పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందని గార్ట్‌నర్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక డేటా సెంటర్‌లు,
ఎనర్జీ, కూలింగ్ టెక్నాలజీలు,కంప్యూటర్ చిప్‌ల కోసం ఇదిచాలా ఎక్కువఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అంతకుమించి భారత విశ్వ విద్యాలయాలలో పరిశోధనలు జరగాలన్నారు. తెలివైన వ్యక్తులను ఒకతాటిపైకి తీసుకు రావడం లాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. చైనాలోని కంపెనీలు ప్రధానంగా హార్డ్‌వేర్‌పైనే రాణించడం ప్రస్తుత ఎఐ వ్యూహం విజయానికి దోహదపడిందని ఇండ్కల్ టెక్నాలజీ సిఇఒ,ఫౌండర్ ఆనంద్ దేబే పేర్కొన్నారు.

ఎఐ, క్వాంటిటేటివ్ ఫైనాన్స్‌లో నిపుణుడైన చైనా ఇంజినీర్ లియాంగ్ వెన్ ఫెంగ్ 23లో డీప్‌సీక్‌ను ఏర్పాటు చేశారు. దీనికి డీప్‌సీక్ ఆర్1గా పేరు పెట్టారు. ఎఐ మోడల్స్‌ను అందిపుచ్చుకోవడానికి అమెరికన్ కంపెనీలు బిలియన్ డాలర్లు
(వేల కోట్ల రూపాయలు) వ్యయం చేస్తుంటే.. డీప్‌సీక్ కేవలం 6 మిలియన్ డాలర్లు (రూ.52 కోట్లు) ఖర్చు చేయడం విశేషం. సాంకేతిక ఆధిపత్య పోటీలో చైనా ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడానికి జిపియు సెమీ కండక్టర్ల వంటి హైఎండ్ టెక్నాలజీలను ఆ దేశానికి ఎగుమతి చేయడాన్ని అమెరికా నిషేధించింది. అమెరికా నుంచి ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని డీప్‌సీక్ రాణించడం విశేషం.

**తక్కువ ఖర్చుతో ప్రకంపనలు : మంత్రి వైష్ణవ్**

చైనాకు చెందిన డీప్‌సీక్ తక్కువ ఖర్చుతో ఎఐ రంగంలో ప్రకంపనలు సృష్టించిందని భారత ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ పేర్కొన్నారు. ఇక్కడ డేటా ప్రైవసీకి సంబంధించిన ఆందోళనల పరిష్కారం కోసం భారత సర్వర్ల నుంచే దీన్ని హోస్ట్ చేస్తామన్నారు. భారత్‌లో ఎఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌ను సైతం ప్రారంభిస్తామన్నారు. రాబోయేకొన్ని నెలల్లోభారత్ సొంతజనరేటివ్ ఎఐమోడల్‌ను అభివృద్ధి చేసుకోబోతోందన్నారు. భాషా,సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దేశీయ అవసరాల కోసం అతితక్కువ ఖర్చుతో ఎఐ మోడల్‌ను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్ప టివరకు ఆరుగురు డెవలపర్లను గుర్తించామమన్నారు. వచ్చే ఎనిమిది, పది మాసాల్లో ఎఐ మోడల్‌ను ఆవిష్కరించే అవకాశం ఉందన్నారు.




# ఆహారం విషతుల్యం

మనం తినే తిండి మన శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తుంది. మన బతుకు చక్రం ముందుకు కదిలేలా చేస్తుంది. అందుకే, పెద్దలు అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు మనం తినే ఆహారం పోషకాలకు బదులుగా ఓ ఆందోళన కలిగించే అంశంగా పరిణమించింది. భారతదేశపు ఆహార నమూనాల్లో 50 శాతానికిపైగా పదార్థాల్లో పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. ఈ నేపథ్యంలో మనం తినే ఆహారం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇటీవలి కాలంలో మనదేశంలో క్యాన్సర్ కేసులు కూడా పెరుగుతూ వస్తున్నాయి. దీంతో ఆరోగ్య నిపుణులు, పర్యావరణవేత్తల్లో ఆందోళన మొదలైంది. వ్యవసాయంలో పరిమితికి మించి పురుగుమందులు, కీటక నాశనులు వాడటం, వాటి హానికరమైన రసాయనాలు ఆహారంపై పేరుకుపోవడానికి కారణమవుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా ట్లగ్లెఫోసేట్ అనే పురుగుమందు క్యాన్సర్‌కు దారితీయవచ్చని హెచ్చరించింది. పండ్లు, కూరగాయలు, ధాన్యాల్లో సాధారణంగా కనిపించే ఆర్గానోఫాస్ఫేట్స్, కార్బమేట్స్, ట్లగ్లెఫోసేట్ తదితర రసాయనాల అవశేషాలకు రొమ్ము, ప్రొస్టేట్, పొట్ట మొదలైన క్యాన్సర్లకు లంకె ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) నివేదిక వెల్లడించింది. అంతేకాదు పురుగుమందులు (పెస్టిసైడ్లు) మన శరీరంలో కీలకమైన కణాల పనితీరును దెబ్బతీస్తాయి. డీఎన్ఏ విధ్వంసానికి కూడా దారి తీస్తాయి. పంటల దిగుబడి పెరగడానికి ఏండ్ల కొద్దీ రసాయన ఎరువులు, పురుగుమందులను ఉపయోగిస్తున్నాం. కానీ, ఈ రసాయనాల ప్రభావం పొలానికి బయట కూడా ఉంటుంది. ఇవి నేల, నీరు, ఆహారాల్లో చేరిపోతాయి. మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. అందువల్ల మన సాగు విధానాన్ని పునః పరిశీలించుకోవాలి. సహజమైన, రసాయనాలు లేని సాగు విధానాలను ఎంచుకోవడమే దీనికి పరిష్కారం. ఇలా చేస్తే పర్యావరణాన్ని కాపాడుకోవడంతోపాటు మన కుటుంబాలను, భావితరాలను కూడా పరిరక్షించుకుంటాం. వచ్చే ఐదేండ్లలో క్యాన్సర్ కేసులు 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులు అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రీబూట్..!

సాంకేతికత, డిజిటల్ పరికరాలు అనివార్యమైన యుగంలో మనమున్నాం. స్క్రీన్‌లు మనిషి జీవితంపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. చిన్నారికి ఆకాశంలో చందమామను చూపించి గోరుముద్దలు తినిపించే తల్లులు.. స్మార్ట్‌ఫోన్‌లో కార్టూన్‌లు చూపిస్తున్నారు. మన చుట్టూ వున్న వాస్తవిక ప్రపంచం కంటే.. స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, వైఫై యాక్సెస్, ఇంటర్నెట్‌తో 247 వర్చువల్ ప్రపంచంతో కనెక్ట్ అయ్యే వుంటున్నాం. నెలల చిన్నారి నుంచి పండు ముదుసలి వరకూ స్మార్ట్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్న పరిస్థితి. కుటుంబంలోని నలుగురూ నాలుగు స్క్రీన్‌లలో వారికి నచ్చిన ప్రపంచంలో విహరిస్తున్నారు తప్ప పక్కనే వున్న వారిని పట్టించుకునే స్థితిలేదు. చిన్నా పెద్దా తేడాలేకుండా ఫేస్‌బుక్‌లో రీల్స్, యూట్యూబ్‌లో షార్ట్స్, వాట్సప్‌లో చాటింగ్, మెసెంజర్‌లో మీటింగ్ సర్వసాధారణంగా మారింది. స్టేటస్‌లు, లైక్‌లు, షేర్‌లు, మెసేజ్‌లతో గంటలకొద్దీ కాలం ఆవిరైపోతోంది. మనం నష్టపోతున్న కాలాన్ని ప్రకటనల రూపంలో కార్పొరేట్ కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. గతించిన కాలం తిరిగిరాదు. కరిగిపోతే గాని కాలం విలువ తెలియదు. 'మీరు చేయగలనని నమ్మినా, చేయలేనని నమ్మినా– మీ నమ్మకం నిజమౌతుంది' అంటారు హెన్రీఫోర్డ్. ప్రపంచంతో తిరిగి కనెక్ట్ అవడానికి, మనల్ని మనం రీబూట్ చేసుకోవడానికి 'జాతీయ అన్‌ప్లగ్గింగ్ దినోత్సవం' ఒక మార్గం. 'మీరు ప్రపంచంలో మార్పును చూడాలనుకుంటే, ముందుగా మీరు మారండి' అంటారు గాంధీజీ. ప్రకృతిలోని సౌందర్యాన్ని, సమాజంలోని బంధాలను ఆస్వాదించాలంటే, మానవ జీవితంలోని ప్రతి క్షణాన్నీ నిర్వచించే వర్చువల్ ప్రపంచం నుంచి డిస్‌కనెక్ట్ కావాలి. ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లను పవర్ ఆఫ్ చేసి, స్మార్ట్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసి%ా% ప్రకృతిని అనుభవించండి. జనాలతో మమేకం కండి. ఏ పార్కులోనో కాసేపు గడపండి. ఎగిరే పక్షులను, చెట్లపైకి ఎక్కే



ఉడుతలను, ప్రవహించే నీటి సవ్వడిలోని సంగీతాన్ని ఆస్వాదించండి. సూర్యోదయంలోని లేలేత కిరణాల వేడిని, సూర్యాస్తమయంలోని అద్భుత సౌందర్యాన్ని అనుభవించండి. పిల్లలతో కాసేపు ఆడుకోండి. స్నేహితులతో కలిసి కప్పు కాఫీ తాగండి. కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపండి. వాటిని కూడా పుస్తకంలోని బొమ్మలాగో, యూట్యూబ్ వీడియోలాగో చూడకండి. మీ డిజిటల్ పరికరాలు అన్‌ప్లగ్గింగ్ వల్ల కొన్ని మెయిల్స్, వాట్సప్ స్టేటస్‌లు చూడలేకపోవచ్చు. ఆన్‌లైన్ మిత్రుల సందేశాలకు జవాబు ఇవ్వలేకపోవచ్చు. కానీ, వాస్తవిక ప్రపంచంలో అసలైన స్నేహితులతో మనస్ఫూర్తిగా గడపగలుగుతారు. కుటుంబ బంధాలను కొత్తగా చూడగలిగే సమయం దొరుకుతుంది. ఒక్కరోజైనా వర్చువల్ ప్రపంచం నుంచి బయటపడి%ా% ఒరిజినల్ ప్రపంచంలో బతకమని, బతికి చూడమని చెప్పడానికే ప్రతి ఏడాది మార్చి 7న 'అన్‌ప్లగ్గింగ్ డే' జరుపుకుంటున్నారు. 24గంటల తర్వాత దైనందిన జీవితంలో అన్‌ప్లగ్ చేసిన క్షణాలను ఏకీకృతం చేయడానికి మనల్ని ప్రేరేపిస్తుంది.

ఇదంతా సాంకేతికతను, డిజిటల్ పరికరాలను వదిలేయాలని కాదు. వాటిని అవసరం మేరకు పరిమితంగా ఉపయోగించుకోవాలి. డిజిటల్ అలవాట్లు పిల్లల అభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. నిద్రలేమికి కారణమౌతాయి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలను క్షీణింపజేస్తాయని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. 'మీరు మీ భవిష్యత్‌ను మార్చలేరు. కానీ, మీ అలవాట్లను మార్చుకోగలరు. కాబట్టి, మీ


# ముదిరిపోయిన సెల్‌ఫోన్ వ్యసనం..



**సోషల్ మీడియా బానిసలుగా విద్యార్థులు**
**82% మంది సోషల్ మీడియాకే అంకితం**
**34% మంది వద్ద సొంత స్మార్ట్‌ఫోన్లు**
**విద్యకు వినియోగించేవారు తక్కువే**
**ఏఎస్ఈఆర్ నివేదికలో చేదు నిజాలు**

హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వ్యసనం ముదిరిపోయింది. వారిలో చాలా మంది సోషల్ మీడియా మోజులో చిక్కుకుపోయారు. 14–16 ఏండ్ల మధ్య వయస్కుల్లో ఏకంగా 82% మంది తమ స్మార్ట్‌ఫోన్లను సోషల్ మీడియా కోసమే ఉపయోగిస్తున్నారు. వయసులవారీగా చూస్తే.. 14 ఏండ్ల వయస్సుల్లో 79% మంది, 15 ఏండ్ల వయస్కుల్లో 82.2% మంది, 16 ఏండ్ల వయస్కుల్లో 82.5% మంది సోషల్ మీడియాలో మునిగిపోతున్నట్టు వార్షిక విద్యాస్థాయి నివేదిక (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) వెల్లడించింది. 14–16 ఏండ్ల వయస్కులు విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు స్మార్ట్‌ఫోన్లను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తున్నట్టు ఈనివేదిక తేల్చింది. బాలురే స్మార్ట్: బాలికలతో పోల్చితే బాలురే అధికంగాస్మార్ట్‌ఫోన్లను, సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నట్టు ఏఎస్ఈఆర్ వెల్లడించింది. రాష్ట్రంలోని 96%మంది విద్యార్థుల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. 97% మంది బాలురు, 94%మంది బాలికల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నట్టు తేలింది. సామాజిక మాధ్యమాల నుంచి రక్షణ పొందే విషయమై విద్యార్థులకు అవగాహన బాగానే ఉన్నది. ఖాతాను బ్లాక్ చేయడంపై 67.2%మంది, పాస్‌వర్డ్ మార్చడం 62% మంది,ప్రొఫైల్‌ను గోప్యంగా ఉంచుకోవడంపై 60.8% మంది విద్యార్థులుఅవగాహన కలిగి ఉన్నారు. చదువు కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్న విద్యార్థులు 61.1% మందే.బాలురలో 60.7%,బాలికల్లో 61.5% మంది చదువుల కోసం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. విద్యార్థుల్లో 34.3% మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. బాలురలో 39% మంది,బాలికల్లో 29% మంది సొంత స్మార్ట్‌ఫోన్లను కలిగిఉన్నారు.వయసులవారీగా చూస్తే..16 వయస్కుల్లో 46.3%,15 ఏండ్ల వయస్కుల్లో 29%,14ఏండ్ల వయస్కుల్లో 31.11% మందిస్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు. విద్యార్థుల్లో 88.6%మంది యూట్యూబ్‌లో వీడియోలను వీక్షించేందుకు, 89% మంది అలారమ్ కోసం, 84.4%మంది సమాచార సేకరణ కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్నట్టు చెప్పారు.

# అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు..?



అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజీవ్రాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజీవ్రాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢిల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢిల్లీ పీఠం పట్టుకుని గట్టిగా అతుక్కు పోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంత సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢిల్లీలో 13 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయాంగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువుతొ అరవింద్ కేజ్రీవాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 19లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజ్రీవాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 0 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజీవ్రాల్ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చని కేజ్రీవాల్‌కు అర్థం అయిపోయింది. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమకాడిని వదిలేశారు. తానే అవినీతికి కేంద్రంగా మారారు. తన పార్టీవారు, మంత్రులు పలువురు ఇందులో కూరుకుపోయారు. చివరకు లిక్కర్ కేసులో కేజ్రీవాల్ జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృతమవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది.

19లో మాదిరి 24లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజీవ్రాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు తగిన కారణాలు కానరావడం లేదు. ఎందుకంటే అవినీతి వ్యవహారంతో కేజ్రీవాల్ ప్రతిభ మసకబారింది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తన ప్రతిష్ఠ దిగజారిపోయేలా చేసుకుంది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతే కాలనాగులా ఆయననే చుట్టుముట్టుకుంది. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215